బీఎల్‌వోపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు



# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 12 జూలై-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


ఈ ఆరు హత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే..



## అమెరికాపై పగ తీర్చుకోవడానికి
# కట్టుబడి ఉన్నాం

- ఇరాన్ సుప్రీం మొజ్తబా ఖమేనీ తమ సుప్రీం నేత,
- తన తండ్రి అయతొల్లా ఖమేనీని హతమా
- మా ప్రజల డిమాండూ అదే
- ఇరాన్ సుప్రీం మొజ్తబా ఖమేనీ



**టెహ్రాన్, జూలై 11:** తమ సుప్రీం నేత, తన తండ్రి అయతొల్లా ఖమేనీని హతమార్చిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నానని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శనివారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక రాతపూర్వక సందేశాన్ని విడుదల చేస్తూ ఇరాన్ ప్రజల ఈ డిమాండ్‌ను తప్పక నెరవేర్చవలసిందేనని పేర్కొన్నారు. కాగా, గత నెలలో అమెరికాతో జరిగిన 14 పాయింట్ల అవగాహన ఒప్పందాన్ని కనుక అగ్రరాజ్యం ఉల్లంఘించి దాడులు చేసినా.. పూర్తి స్థాయి రక్షణ కోసం సన్నద్ధంగా ఉన్నామని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. అమెరికాపై టెహ్రాన్‌కు అస్సలు నమ్మకం లేదని, చర్చల సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్‌కు అదే విషయాన్ని స్పష్టం చేసినట్టు తెలిపారు. హొర్ముజ్ జలసంధి పూర్వ స్థితికి రావాలంటే ఇరాన్ షరతులను పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కాగా, శనివారం టెహ్రాన్‌లో వినిపించిన భారీ పేలుడు శబ్దం పాత ప్రమాదకరమైన మందుగుండు సామగ్రిని నిర్వీర్యం చేసే ప్రక్రియ వల్ల ఏర్పడిందని ఇరాన్ అధికారులు ప్రకటించారు.

మిగతా 3లో..

## మేడిగడ్డను ముట్టకుండానే
# నీళ్లు ఎత్తొచ్చు

- రిజర్వాయర్లు, చెరువులు అన్నీ నింపొచ్చు
- భద్రాచలానికి ముప్పు పోలవరం ఎత్తు వల్లే
- రేవంత్‌రెడ్డి మళ్లా గెలిచేది కలే.. ఆయనకు
- దమ్ముంటే అసెంబ్లీ రద్దుచేసి ఎన్నికలకు వెళ్లాలి
- ఫిరాయింపు దార్లతోనైనా రిజైన్ చేయించు!
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్




**హైదరాబాద్, జూలై 11:** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో జలాశయాలు ఎండిపోతుంటే, ప్రభుత్వం రాజ కీయ కక్షతోనే కాళేశ్వరం పంపులను నడుపడం లేదని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిప డ్డారు. మేడిగడ్డ బరాజ్ గేట్లను ముట్టకుండా, వాటిని మూయకుండానే 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయవచ్చని

మిగతా 3లో..

## హైదరాబాద్‌లో
# బోనాల సందడి



**హైదరాబాద్, జూలై 11:** భాగ్యనగరంలో బోనాల ఉత్సవాల సందడి మొదలు కానుంది. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువెత్తు రూపంగా నిలిచే హైదరాబాద్ ఆషాఢ బోనాల ఉత్సవాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇందుకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది బోనాల జాతర జులై 16వ తేదీ నుండి ప్రారంభమై, ఆగస్టు 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనుంది. కోట్లాది మంది భక్తులు తరలివచ్చే ఈ చారిత్రాత్మక ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందు కు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఆషాఢ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. బోనాలు తెలంగాణ గంగా–జమున తెహజీబ్‌కు ప్రతీకగా పేర్కొన్నారు. హిందూ – ముస్లిం ఐక్యత దేశానికి

మిగతా 3లో..

# ప్రముఖ గాయని ఎస్.జానకి మృతి



మిగతా 2లో..

# షాబాద్ హత్యలు ప్రభుత్వ వైఫల్యమే..

- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- హోం మంత్రిగా, సీఎంగా రేవంత్‌రెడ్డి పూర్తిగా ఫెయిల్
- నైతిక బాధ్యత వహించి తక్షణమే పదవికి రాజీనామా చేయాలి
- పరామర్శకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టులు అమానుషం
- మాజీ మంత్రి హరీశ్ ధ్వజం



**సిద్దిపేట, జూలై 11 :** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు హత్యకు గురైన ఘటన రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతి కి గురిచేసిందని,

# గద్వాల జిల్లాలో దారుణం..

- పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య



మిగతా 3లో..

## జానకమ్మ మరణం పాటకు
# తీరని లోటు : కేసీఆర్



- భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తారని వ్యాఖ్య
- ప్రముఖ గాయని జానకి మృతిపై సంతాపం

**హైదరాబాద్, జూలై11 :** జానకమ్మ మరణం ముఖ్యంగా, దక్షిణ భారత సంగీతానికి, పాటకు తీరని లోటని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ గాయని, సంగీత దర్శకురాలు అభిమానులంతా జానకమ్మ అని ప్రేమతో పిలుచుకునే, సినీ నేపథ్య గాయని ఎస్. జానకి (శిష్ఠ శ్రీరామమూర్తి జానకి) మరణం పై ఆయన సంతాపం ప్రకటించారు. గాన కోకిలగా ప్రపంచవ్యాప్తంగా

మిగతా 3లో..

# రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

- ఖూనీ అయిన ప్రజాస్వామ్యం!
- షాబాద్ ఘటనతో తేటతెల్లమైంది
- రేవంత్‌రెడ్డీ.. రాజీనామా చెయ్
- బాధిత కుటుంబాల పరామర్శకు వెళ్తే అరెస్టులు చేయడమేమిటి?
- నిందితులను వదిలి, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలపై నిర్బంధమేల?
- నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్, జూలై 11:** 'కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. షాబాద్‌లో జరిగిన ఘటన, అనంతర పరిణామాలతో ఆ విషయం మరింత తేటతెల్లమైంది' అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. దీనికి బాధ్యత వహించి సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన ఘోర ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు అక్రమంగా అడ్డుకొని, అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో

## ఆరుగురి హత్యలకు
# సర్కార్‌దే బాధ్యత

- పోక్సో నిందితుడికి బెయిల్ వల్లే దారుణం
- రాష్ట్రంలో గాడితప్పిన శాంతిభద్రతలు
- ఆడబిడ్డల మాన ప్రాణాలకు రక్షణ కరువు
- హోంశాఖ మంత్రిగా రేవంత్‌రెడ్డి ఫెయిల్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జూలై11 :** షాబాద్‌లో ఆరుగురి హత్యలకు కాంగ్రెస్ సర్కార్‌దే బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. పోక్సో కేసులో నిందితుడికి బెయిల్ రావడం వల్లే ఈ దారుణం జరిగిందని విమర్శించారు. న్యాయమూర్తి వద్ద సర్కార్ పటిష్టమైన వాదనలు వినిపించకపోవడంతోనే ఈ ఘోరమైన ఘటన చోటుచేసుకున్నదని, హోంశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ధ్వజమెత్తారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. షాబాద్ ఘటనపై భావోద్వేగంతో స్పందించారు. షాబాద్ హత్యాకాండ తనను ఎంతగానో కలిచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. బాలికపై లైంగికదాడి జరిగిన తర్వాత ఆ దుర్మార్గుడికి బెయిల్ ఇవ్వవద్దని అమ్మాయి తల్లిదండ్రులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని దుయ్యబట్టారు. సర్కార్ తరఫున జడ్జికి సరైన పద్ధతిలో నివేదించకపోవడంతోనే షాబాద్ హత్యాకాండ జరిగిందని స్పష్టంచేశారు. ఇందులో రాష్ట్ర హోంశాఖతో పాటు నిందితుడికి బెయిల్ రాకుండా చూడటంలో విఫలమైన న్యాయవాదుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదని పేర్కొన్నారు. 'ఇలాంటి దుర్మార్గులకు బెయిల్ ఎందుకు ఇస్తున్నారు? మానవమృగాలను సమాజంపైకి ఎందుకు వదులుతున్నారు? ఆరుగురి ప్రాణాలకు ఎవరు బాధ్యులు? దీనికి హోంమంత్రిగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

మిగతా 3లో..

# నిజామాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్..

- ఒకే రాత్రిలో నాలుగుచోట్ల చోరీలు

మిగతా 2లో..



# రైతన్నకు అండగా రైతు భరోసా..

- జిల్లాలో రూ.318.42 కోట్ల నిధుల జమ

మిగతా 3లో..



## షాబాద్ హత్యల కేసు..
# ఎస్సై, సీఐల సస్పెన్షన్

మిగతా 3లో..

# పోక్సో కేసు పెట్టారనే కక్షతో ఆరుగురి



**హైదరాబాద్, జూలై 11:** పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మైనర్ బాలికను నిందితుడు రాజ్‌కుమార్ బలవంతంగా ఇంటి నుంచి కారులో తీసుకెళ్తున్న దృశ్యాలు బయటకొచ్చాయి. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్‌కుమార్‌పై మే 16వ తేదీన పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలిక (17)ను వేధించాడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మే 26వ తేదీన అరెస్టు చేసి జైలుకు పంపించారు. శుక్రవారం అతను జైలుపై విడుదలయ్యాడు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మైనర్ బాలిక ఇంటికి వెళ్లాడు. షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని మైనర్ బాలిక (17) ఇంట్లోకి ప్రవేశించి, ఆమెను బల వంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి లక్ష్మీ, నాయ నమ్మ రుక్కమ్మ అడ్డుపడ్డారు. దీంతో వారిద్దరినీ కత్తితో పొడి చంపాడు. బాలికను దైవాలగూడ సమీపంలోని చెరువు దగ్గరకు తీసుకెళ్లి పీకకోసి హత్య చేశాడు. శనివారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో తన ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్.. కట్టు కున్న భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్(4), దైవీక్షిత్(2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. అనంతరం తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి అందర్నీ చంపేశానని.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని రాజ్ కుమార్ చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అరుణ్ కుమార్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కాగా, పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఆరు హత్యలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# నిజామాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్..



## ఒకే రాత్రిలో నాలుగుచోట్ల చోరీలు

**హైదరాబాద్, జూలై 11:** నిజామాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్ సృష్టించింది. ఒకే రాత్రి నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత టాటా సుమోలో వచ్చిన నలుగురు దొంగలు ముందుగా నిర్మల్ జిల్లాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దోపిడీకి పాల్పడ్డారు. అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశించి, తెల్లవారుజామున ఆర్మూర్ పట్టణంలోని ఓ మెడికల్ షాప్ షట్టర్ ధ్వంసం చేసి అందులోని సుమారు లక్షన్నర నగదును దోచుకున్నారు. అనంతరం ఆ దొంగల ముఠా తమ వాహనంలో తెల్లవారుజామున 4.55 గంటల వరకు శ్రీనగర్ కాలనీకి చేరుకుని.. లక్ష్మీ అనే మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు తెంపుకుని పరారయ్యారు. ఆ తర్వాత ఉదయం 5.25 గంటల వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడుతో పాటు ఒక చెవికమ్మను లాక్కున్నారు. మరో చెవికమ్మ లాక్కునే ప్రయత్నం చేస్తుండగా బాధితురాలి కేకలు విని ఆమె భర్త బయటకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. దీంతో వారు టాటా సుమో వాహనంలో అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా ఈ చోరీలకు పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనాస్థలిని పరిశీలించిన నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య ఘటనాస్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దర్యాప్తు అధికారులకు కీలక సూచనలు చేశారు. ఘటన జరిగిన ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించాలని.. నిందితులను వేగంగా పట్టుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# నేటి నుంచి 'సీపీఎస్' జనజాగరణ యాత్ర : సీపీఎస్ఈయూ




**హైదరాబాద్, జూలై 10 :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్త 'జనజాగరణ యాత్ర'ను తలపెట్టినట్టు తెలంగాణ సీపీఎస్ఈయూ అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తెలిపారు. శనివారం నుంచి ఈ యాత్ర ప్రారంభంకానున్నదని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి సన్నిధి నుంచి యాత్ర ప్రారంభమవుతుందని ఆగస్టు 18 వరకు కొనగుతుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. 'నాడు మా ఓట్లతో గెలిచారు.. నేడు మా భద్రత కోసం పాత పింఛన్‌ను అమలుచేయండి' అన్న పిలుపుతో ప్రజాప్రతినిధులను కలుస్తామని పేర్కొన్నారు. యాత్ర ద్వారా ఆఫీస్ సబార్డినేట్ నుంచి గ్రూప్-1 వరకు అన్ని శాఖల ఉద్యోగులను సంఘటితం చేస్తామని పేర్కొన్నారు. ఈ యాత్రకు టీఎన్జీవో, టీజీవో, పీఆర్టీయూ టీఎస్, ఎస్టీయూ టీఎస్, యూటీఎఫ్, టీఆర్టీఎఫ్, తపస్, ఎస్జీటీయూ, టీపీఆర్టీయూ తదితర సంఘాలు మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారని, తాను యాత్రలో పాల్గొంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ యాత్ర ముగింపుగా ఆగస్టు 23న లక్ష మంది ఉద్యోగులతో 'చలో హైదరాబాద్' నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి నరేశ్‌గౌడ్, నరేందర్‌రావు, పవన్ పాల్గొన్నారు.

# ప్రముఖ గాయని ఎస్.జానకి మృతి



**హైదరాబాద్, జూలై 11:** భారతీయ చలనచిత్ర రంగాన్ని తన మధుర గాత్రంతో దశాబ్దాల పాటు ఏలిన 'దక్షిణ భారత గాన కోకిల' ఎస్. జానకి (88) ఇకలేరు. గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, శనివారం కర్ణాటకలోని మైసూరులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఈ ఏడాది జనవరిలోనే ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ మరణించడంతో ఆమె తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. కొడుకు దూరమైన కొన్ని నెలలకే జానకమ్మ కూడా కన్నుమూయడంతో సంగీత లోకంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసినట్లయింది. జానకమ్మ 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచే నాదస్వరం విద్వాంసుడు పైడిస్వామి వద్ద సంగీతంలో ఓనమాలు నేర్చుకున్నారు. సంగీతంపై ఆమెకున్న ఆసక్తిని గమనించిన మేనమామ, ఆమెను మద్రాసు (చెన్నై) తీసుకువెళ్లారు. అది ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. 1957లో 'విధియిన్ విలైయాట్టు' అనే తమిళ చిత్రంతో కెరీర్ ప్రారంభించిన ఆమె, అదే ఏడాది 'ఎమ్మెల్యే' సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టారు. తెలుగు మాతృభాష అయినప్పటికీ జానకి కేవలం ఒక భాషకే పరిమితం కాలేదు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ సహా దాదాపు 20కి పైగా భారతీయ, అంతర్జాతీయ భాషల్లో 48,000 కంటే ఎక్కువ పాటలు పాడి రికార్డు సృష్టించారు. మైమరపించే మెలోడీలు, ఉరకలెత్తించే మాస్ పాటలు, భక్తి గీతాలు.. ఇలా ఆమె పాడని జానర్ లేదు. పాటలో భావాన్ని పలికించడంలో, వెండితెరపై నటి హావభావాలకు అనుగుణంగా స్వరాన్ని మార్చడంలో జానకమ్మకు ఆమే సాటి. చిన్న పిల్లల గొంతును సైతం అలవోకగా అనుకరిస్తూ ఆమె పాడిన పాటలు శ్రోతలను అబ్బురపరిచాయి. అందుకే పరిశ్రమ ఆమెను ప్రేమగా 'క్వీన్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్' అని పిలుచుకునేది.

# ఈ ఆరు హత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే..

## షాబాద్ ఘటనపై కేటీఆర్




**హైదరాబాద్, జూలై 11:** పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. షాబాద్‌లో జరిగిన సంఘటన అతి దారుణమైంది. అందరం కూడా కలత చెందే ఒక దరిద్రమైన వార్త అని కేటీఆర్ అన్నారు. పోక్సో లాంటి ఘటన జరిగిన తర్వాత, ఒక మైనర్ బాలిక మీద అత్యాచారం జరిగిన తర్వాత వారికి బెయిల్ ఇవ్వడం.. బెయిల్ ఇచ్చే క్రమంలో న్యాయమూర్తుల దగ్గర ప్రభు త్వం తన వాదనలను పటిష్టంగా వినిపించకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని నేనైతే అనుకుంటున్నా. ఏ అమ్మాయి మీదైతే అత్యా చారం జరిగిందో..అఘాయిత్యం జరిగిందో..ఆఅమ్మాయి, కుటుంబసభ్యులు భయపడుతూ దయచేసి ఆ దుర్మార్గుడికి బెయిల్ ఇవ్వొ ద్దు అని చెప్తుంటే కూడా మీరు పెడచెవిన పెట్టి కోర్టులో న్యాయమూర్తికి సరిగ్గా నివేదించకపోవడం వల్ల ఈ దుర్మార్గం జరిగిందన్నారు. షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలు.. ప్రభుత్వ నిర్లక్ష్యం తో జరిగిన హత్యలేనని కేటీఆర్ అన్నారు. ఈ ఆరుగురి హత్యకు కచ్చితంగా హోంశాఖ వైఫల్యం, నిందితుడికి బెయిల్ వచ్చేలా నిర్లక్ష్యంగా వాదించిన న్యాయవాదుల వైఫల్యమే కారణమ న్నా రు. రేవంత్ రెడ్డి కచ్చితంగా సమాధానం చెప్పాలి. ఇట్లాంటి దుర్మార్గులకు బెయిల్ ఎందుకు ఇస్తు న్నరు. ఏ కారణం చేత వాళ్లకు బెయిల్ ఇచ్చి ఈ మానవ మృగాలను సమాజంలోకి మీరు వదులుతు న్నారు. ఎవరు బాధ్యులు..? అని కేటీఆర్ అడిగారు. ఓ ఆడపిల్ల తండ్రిగా అడుగుతున్నా.. ఎంత బాధ అవుతది..అఘాయిత్యంజరుగడమే ఘోరమ ంటే.. అఘాయిత్యం జరిగిన తర్వాత పబ్లిక్‌గా వచ్చి చెప్పుకోవడమే భయంకరమైన పరిస్థితి అంటే దాని మీదికెల్లి ఇవాళ ఆ మానవ మృగాలకు బెయిళ్లు ఇచ్చి వాళ్ల పలుకుబడి, డబ్బులను ఉపయోగించుకొని అఘాయిత్యాలు చేస్తుంటే సిగ్గులేకుండా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నోరు మూసుకుని కూర్చుని.. ఏ ధైర్యంతో రేపటి రోజున ఆడపిల్లలు ఏమన్నా జరిగితే బయటకు వచ్చిఫిర్యాదు చేస్తరని ప్రశ్నిం చారు. తల్లిదండ్రులు భయపడరా.. ? సిగ్గుండాలి ఈ ప్రభుత్వానికి, సీఎంకి అని ఫైర్ అయ్యారు.

# ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూత..!



**హైదరాబాద్, జూలై 11:** ప్రముఖ సినీనేపథ్య గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జానకి గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. వయసు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె శనివారం ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కలిపి 50వేలకు పైగా పాటలతో గాన కోకిలగా విరాజిల్లిన జానకి ఇక లేరనే వార్త సంగీత ప్రియులను కలచివేస్తోంది. లెజెండరీ గాయని ఎస్.జానకి గుండెపోటుతో మరణించారు. మైసూర్‌లోని అపోలో బీజీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె 88 ఏళ్ల వయసులో ప్రాణాలు విడిచారు. తన మధురమైన గాత్రంతో సంగీత ప్రియుల ఆదరాభిమానాలు చూరగొన్న జానకి ఇకలేరనే విషయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్సీ ఎల్ రమణ



**జగిత్యాల, జూలై 11:** జగిత్యాల నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ ఎల్ రమణ శనివారం అందజేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం జగిత్యాల నియోజకవర్గంలోని తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన లక్షా యాభైవేల రూపాయల చెక్కులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ లబ్ధిదారులకు ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీశ్, మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ, రాయికల్ మండలం ప్రధాన కార్యదర్శి కొండపల్కల రత్నాకర్ రావు, వొల్లాల గంగాధర్, గంగిపెల్లి వేణుమాధవ్, పెండెం గంగాధర్, చిరంజీవి, నందు నాయక్ పాల్గొన్నారు.

# హరీశ్‌రావు కేసీఆర్ తయారు చేసిన ఒక సైనికుడు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జూలై 11:** హరీశ్ రావు కేసీఆర్ తయారు చేసిన ఒక సైనికుడు. కేసీఆర్‌కు ఈరోజు కాదు పార్టీ ఆవిర్భావం ముందు నుంచి ఒక రక్షణ కవచంలా అండగా నిలబడ్డ నాయకుడు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. హరీశ్ రావు మీద ఎప్పటి నుంచో ఈ పుకార్లు వస్తనే ఉన్నయి. ఆయన చెప్తనే ఉన్నడు పాపం. ఆయన ఒక్కసారి కాదు.. ఇప్పటికి కొన్ని వందల సార్లు చెప్పిండు. నాకు క్యారెక్టర్ ఇంపార్టెంట్.. నేను నీలాగా కాదు రేవంత్ రెడ్డి. నువ్వు నాలుగు పార్టీలు మారినోడివి.. నువ్వు మాట్లాడితే ఎట్లా..? అని కూడా చెప్పిండు. ఆయనను ఇంకా ఎన్నిసార్లు హరీశ్ రావుతో చెప్పిస్తరన్నారు. ఈ దేశంలో, రాష్ట్రంలో శీలపరీక్షలు ఎవరికన్నా పెట్టాల్సింది ఉంటే అది రేవంత్‌రెడ్డికి.. ఎందుకంటే ఆయన లాగా మాకు లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఆ పరిస్థితి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీకి పోతే ఏం చేస్తడో.. నాకు తెలుసు, మీడియా మిత్రులకు కూడా తెలుసు. మీకు సిగ్గపడుతున్నరు.. చెప్తలేరు. ఆయన పొద్దున కాంగ్రెస్ తో ఉంటడు.. సాయంత్రం బీజేపీతో ఉంటడు. ఆయన గురించి ఎవరికి తెలియదు.. రాత్రి పోయి బీజేపోళ్ల కాళ్లు పట్టుకుంటడు. పొద్దున్నంతా కాంగ్రెస్‌తో డ్రామా చేస్తడు. ఆయన కూడా హరీశ్ రావు గురించి మా నాయకుల గురించి.. కాబట్టి రేవంత్ రెడ్డి పార్టీ మార్పిడి గురించి ఎంత తక్కువ మాట్లాడితే ఆయన ఆరోగ్యానికి అంత మంచిదని సూచించారు.

# యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారానికి సభ్యుడు గైర్హాజరు



**యాదగిరిగుట్ట:** గత నెలలో ప్రభుత్వం యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులను నియమించింది. శనివారం బోర్డు ప్రమాణ స్వీకారం ఉండగా సభ్యుడు నరసింహమూర్తి గైర్హాజరయ్యారు. గతంలో ట్రస్ట్ బోర్డులో అనువంశిక ధర్మకర్తకే చైర్మన్ పదవిని కట్టబెట్టడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీకి భిన్నంగా ప్రభుత్వం వేరేవారికి చైర్మన్ పదవి ఇవ్వడంతో ఆయన కినుక వహించినట్టు తెలిసింది. దీంతో ఈ విషయంపై న్యాయపోరాటానికి ఆయన హైకోర్టును ఆశ్రయించినట్టు సమాచారం.

# గద్వాల జిల్లాలో దారుణం..

- పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య



**జోగులాంబ జూలై 10 :** జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం జరిగింది. ఆత్మ కూరు గ్రామంలో పాతకక్షలతో ఓ వ్యక్తికి దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సంధ్యా రాజు (45) కొన్నేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ మహిళను అపహరించాడు. ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. దీనికోసం సదరు మహిళ భర్తను రాజు గతంలోనే హత్య చేసి జైలుకు సైతం వెళ్లాడు. ఇటీవల జైలు నుంచి విడుదలైన రాజును దుండగులు హత్య చేశారు. పాత కక్షలతోనే రాజును హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.




**(మొదటిపేజీ తరువాయి)**

# హైదరాబాద్‌లో బోనాల సందడి



ఆదర్శమని చెప్పుకొచ్చారు. గోల్కొండ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. జులై 16 నుంచి ఆగస్టు 13 వరకు బోనాల ఉత్స వాలు జరగనున్నాయని వెల్లడించారు. భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు. బోనాల షెడ్యూల్ ను ఖరారు చేసారు. అందులో భాగంగా జులై 16 (తొలి బోనం): జగదాం బిక అమ్మవారికి సమర్పించే తొలి బోనంతో గోల్కొండ కోటలో అధికారికంగా వేడుకలు ప్రారంభమవుతాయి.

## మేడిగడ్డను ముట్టకుండానే నీళ్లు ఎత్తొచ్చు

సాంకేతిక ఆధారాలతో స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం రాసిన వివరణాత్మక లేఖను మీడియాకు విడుదల చేశారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద పంపులు నడుపడానికి గోదావరి అవసరమైన దానికంటే ఎకువ ఎత్తులోనే ప్రవహిస్తున్నదని, రోజుకు 2 టీఎంసీల చొప్పున రాబోయే 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే ఉత్తర తెలంగాణలోని రిజర్వాయర్లన్నింటినీ నింపి, రైతాంగాన్ని కరువు నుంచి కాపాడవచ్చని గణాంకాలతో సహా వివరించారు.తెలంగాణభవన్‌లో శనివారం శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, లోక్‌సభలో పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ నామా నాగేశ్వర్‌రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ చీఫ్‌విప్ వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇది కేవలం రాజకీయ పరమైన సబ్జెక్ట్ కాదని, రాష్ట్ర ప్రయోజనాలకు, లక్షలాది మంది రైతాంగానికి సంబంధించిన అంశమని చెప్పారు. అందువల్లే తాము ఇంజినీర్ల లెకలు, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) అధికారిక గణాంకాలతో సహా క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఈ సమావేశానికి వచ్చినట్టు తెలిపారు. 'ప్రస్తుతం గోదావరి బేసిన్ పరిధిలో తెలంగాణలో మొత్తం 57 మీడియం, మేజర్ రిజర్వాయర్లు ఉన్నయ్. వాటి మొత్తం కంబైన్డ్ స్టోరేజీ కెపాసిటీ 418 టీఎంసీలు కాగా, శనివారం ఉదయం 11 గంటల లెకల ప్రకారం వాటిలో 94 టీఎంసీల నీరే ఉన్నది. రాష్ట్రంలోని జలాశయాలు 23 శాతమే నిండి ఉన్నయ్. ఇంకా 77 శాతం జలాశయాలు పూర్తిగా ఖాళీగా ఉన్నయ్. రాష్ట్రంలోని చెరువుల మొత్తం కంబైన్డ్ స్టోరేజీ 253 టీఎంసీలు ఉంటే 50 శాతానికిపైగా చెరువులు ఖాళీగా ఉన్నయ్' అని ఆందోళన వ్యక్తంచేశారు.

## షాబాద్ హత్యలు ప్రభుత్వ వైఫల్యమే..

కేసీఆర్ హయాంలో ఇలాంటి ఆఘాయిత్యం జరిగితే అప్పటి ప్రభుత్వం ఎలా స్పందించిందో, నిందితులను ఎలా శిక్షించిందో తెలంగాణ సమాజానికి తెలుసని గుర్తుచేశారు.ఇది దారుణం ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని మాజీ మం త్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా కుప్పకూలాయని, ముఖ్య మంత్రిగా, హోం మంత్రిగా పూర్తిగా ఫెయిల్ అయిన రేవంత్‌రెడ్డి తక్షణమే నైతిక బాధ్యత వహిస్తూ తన పదవులకు రాజీనామా చేయా లని డిమాండ్ చేశారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా తో మాట్లాడారు. ఈ హృదయ విదారక ఘటన ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసిందని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని ఆరోపించారు.

## జానకమ్మ మరణం పాటకు తీరని లోటు : కేసీఆర్

సంగీత ప్రియుల హృదయాలను గెలుచుకున్న జానకమ్మ గాత్రం అజరామరమని కొనియాడారు. చిన్న నాటినుండే సంగీతం, గానంపై మకువతో సినీ నేపథ్యగాయనిగా తన ప్రస్థానాన్ని సాగించిన జానకమ్మ, 60ఏండ్ల సంగీత జీవితంలో దాదాపు 50వేల పాటలు పాడి, భారత సంగీతవనంలో పాటల కుసుమాలను పూయించిన మహోన్నత గాయని అని కేసీఆర్ శ్లాఘించారు. సినీ నేపథ్యగాయనిగా, సంగీత దర్శకురాలిగా, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. తదితర భారతీయ భాషల్లో పాటలు పాడుతూ సినీ సంగీత జగత్తుకు ఆమె చేసిన కృషి, దేశ సాంస్కృతిక రంగంలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిందని కేసీఆర్ కీర్తించారు.

## రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు




శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దైవాలగూడలో ఆరుగురిని పాశవికంగా హత్య చేసిన ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో చేతకాని ప్రభుత్వం, ప్రతిపక్ష నేతలను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడంలో మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. నేడు తెలంగాణ రాష్ట్రం పోక్సో కేసులకు, మహిళలపై అఘాయిత్యాలకు అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. 'మేమేమైనా నేరస్తులమా? బాధితులను పరామర్శించడం చట్టవిరుద్ధమా?' అని పోలీసులను నిలదీశారు. బాధితులను ఓదార్చడానికి వెళ్తున్న తనతోపాటు మాజీ మంత్రి పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు శంకర్‌పల్లి వద్ద అక్రమంగా నిర్బంధించి, అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆరుగురిని పాశవికంగా పొట్టనబెట్టుకొన్న ప్రధాన నిందితుడు స్వేచ్ఛగా బయట తిరుగుతుంటే, వాడిని పట్టుకోలేని ఈ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై జైలుకు పంపుతున్నదని మండిపడ్డారు. ఇది ప్రభుత్వ చేతగాని పనితీరుకు నిదర్శనమని, ప్రభుత్వం ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు. దైవాలగూడ నిందితుడిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని లేదా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే భారీ ఆర్థికసాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## 7పోస్టులతో టీజీపీఎస్సీ మరో నోటిఫికేషన్




హైదరాబాద్, జూలై 10 : టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదలయ్యింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో 7 టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. స్టేట్ లెవల్లో 2, మల్టీజోన్ లెవల్లో 5 చొప్పున పోస్టులున్నాయి.ఈ పోస్టులకు ఈ నెల 15 నుంచి ఆగస్టు 22 వరకు వెబ్‌సైట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

# ఉన్మాది మారణకాండ..

- ఆరుగురిని కడతేర్చిన కిరాతకుడు
- పోక్సో కేసు పెట్టారని బాధిత కుటుంబంలో ముగ్గురిని చంపిన సైకో
- ప్రశ్నించినందుకు తన భార్యాపిల్లలనూ హతమార్చిన రాజ్‌కుమార్
- బెయిల్‌పై తిరుగుతూ ఘాతుకం
- షాబాద్ మండలం దైవాలగూడలో ఘటన
- బాధితురాలు, ఆమె తల్లి, నానమ్మల హత్య
- నరికి చంపిన రాజ్‌కుమార్.. ఆపై పరార్



హైదరాబాద్,జూలై11: పోక్సో కేసులో బెయిల్ పొంది యథేచ్ఛగా తిరుగుతున్న ఓ నిందితుడు పగబట్టి చేసిన ఘాతుకం కలకలం రేపింది. రెండు గంటల్లో ఏకంగా ఆరుగురిని హతమార్చడం రాజధాని శివారులోని షాబాద్‌ను కుదిపేసింది. కేసు పెట్టిన బాధిత బాలిక కుటుంబాన్ని, ప్రశ్నించిన తన కుటుంబాన్ని సైతం ఆ ఉన్మాది గొంతులు కోసి హతమార్చడం శనివారం రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసిం ది.బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని దైవాలగూ డ గ్రామానికి చెందిన పార్వతి రాజ్‌కు మార్(28) స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ లకు అలవాటు పడ్డాడు. అతనికి షాబాద్ లోని పీఆర్ఆర్ స్టేడియం సమీ పంలో ఇ ల్లు ఉన్నది.ఆఇంటిపక్కనే చిట్యాల లక్ష్మి (45),ఆమె అత్తరుక్క మ్మ(65), కూతుళ్లు బాలిక(17), మేఘన (దివ్యాంగురాలు)తో కలిసి నివాసము టున్నది. లక్ష్మి భర్త మల్లేశ్ గతేడాది మృతి చెందాడు. ఆమె కూతురు శంషాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది.

## హరీశ్‌రావు సాయాన్ని మరువని రోహిత్

- పేదల సాయం కోసం ఆరు లక్షలు అందజేత



సిద్దిపేట, జూలై 11: ఇంజినీరింగ్ సీటు ఇప్పించి కెరీర్‌లో నిలదొక్కుకునేలా సహకరించినందుకు రోహిత్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట పట్టణానికి చెందిన శ్రీనివాస్, వనిత దంపతుల కుమారుడు రోహిత్‌కు విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గతంలో హరీశ్‌రావు కంప్యూటర్ సైన్స్ సీటు ఇప్పించారు.ప్రస్తుతం రోహిత్ రూ.12 లక్షల వార్షిక వేతనంతో అమెరికా బహుళ జాతి సంస్థలో ఉద్యోగం సాధించాడు. హరీశ్‌రావు తనకెంతో సాయం చేశారని గుర్తుచేసుకున్న రోహిత్.. శనివారం సిద్దిపేటలో ఆయన్ను కలిసి తన చదువుకు సాయం చేసిన విషయాన్ని గుర్తుచేశాడు. తన వార్షిక వేతనంలో సగం రూ.6 లక్షలు సమాజ సేవా కార్యక్రమాలకు వినియోగించాలని హరీశ్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్‌ను హరీశ్‌రావు అభినందించారు.

## భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షునిగా నియామకం

- పార్టీ నాయకత్వానికి తోడుపునూరి వెంకటేశం కృతజ్ఞతలు



సిద్దిపేట, జూలై 11: భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షునిగా తనను నియమించినందుకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచంద్ర రావు గారికి, మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారికి, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శ్రీ బైరి శంకర్ ముదిరాజ్ గారికి, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ తోడుపునూరి వెంకటేశం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని జీవితాంతం నిలబెట్టుకుంటానని, పార్టీ సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేస్తూ సిద్దిపేట జిల్లాలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని, పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేందుకు శక్తివంచన లేకుండా శ్రమిస్తానని తెలిపారు.ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, అభిమానులు మరియు శ్రేయోభిలాషులందరికీ మరోసారి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## 'సర్' ప్రక్రియను విజయవంతం చేయాలి : బొబ్బిలి రామకృష్ణ



హైదరాబాద్, జూలై 11: జిల్లాలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను అర్బన్ పరిధిలో వంద శాతం పూర్తి చేయాలని నిజామా బాద్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ కోరారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఆయన ఆధ్వ ర్యంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జిలు, బీఎల్‌ఏలు, సూపర్‌వైజర్లకు సర్ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు.బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్ సీసీ అధ్యక్షుడి సొంత నియోజకవర్గం అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని డివిజన్లకు మెంటర్లను నియమించినట్లు తెలిపారు. డివిజన్లలోని ఒక నిర్దిష్ట ప్రాంతంలో పార్టీ నాయకులందరూ అందుబాటులో ఉంటూ, ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయపడాలన్నారు. అవసరమైన చోట ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ఫారాలు సేకరించి, వాటిని పూర్తి చేయడానికి వలంటీర్లను నియమించుకోవాలని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా పనిచేయాలి. కార్పొరేటర్లు, పోటీ చేసి ఓడిపోయిన వారు, బీఎల్‌ఏ సూపర్‌వైజర్లు తమ తమ డివిజన్లలో వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ, ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు పూర్తి స్థాయిలో సహాయం అందించాలని రామకృష్ణ సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు రత్నాకర్, జావీద్ అక్రమ్, అర్బన్ ఈఆర్వో (జు=ా) కో-ఆర్డినేటర్ అబ్దుల్ వహీద్, డీసీసీ ఉపాధ్యక్షుడు రత్నాకర్ గౌడ్, డీసీసీ కార్పొరేషన్ ఉపాధ్యక్షులు విజయ్ పాల్ రెడ్డి, సలీం, కోశాధికారి సకినాల శివ పాల్గొన్నారు.

## షాబాద్ హత్యల కేసు.. ఎస్సై, సీఐల సస్పెన్షన్




హైదరాబాద్, జూలై 11: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు కీలక ప్రకటన చేశారు. నిందితుడు రాజ్‌కుమార్‌ను పట్టిస్తే రూ.2లక్షల రివార్డు ఇస్తామని పోలీసులు తెలిపారు. ఆరుగురిని హత్య చేసి రాజ్‌కుమార్ పారిపోయాడు. ఇప్పటికే పోలీసులు నిందితుడి కోసం 10బృందాలతో గాలిస్తున్నారు. అయితే ఉదయం నుంచి ఆ చూకీ లభించకపోవడంతో తాజాగా రివార్డు ఇస్తామని ప్రకటించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో..రాజ్‌కుమార్ తనపై పోక్సో పెట్టిన బాలికతో పాటు ఆమె తల్లి, నానమ్మను హత్య చేశాడు. అంతేగాకుండా తనభార్య, పిల్లలను సైతం మర్డర్ చేశాడు. పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈ ఆరు హత్యలు జరిగాయని స్థానికులు షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో పోక్సో కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సైని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉదయం ప్రకటించారు. సీఐ క్రాంతిరెడ్డిని సైతం సస్పెండ్ చేస్తూ తాజాగా సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు రాజ్‌కుమార్‌కు పోలీసులు సహకరించడంతోనే ఈ హత్యలు జరిగాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికారులు చర్యలు చేపట్టారు.

## బీఎల్‌వోపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు



హైదరాబాద్, జూలై 11: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన కామారెడ్డి పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ప్రభుత్వం నియమించిన బీఎల్‌వోలు ఓటర్ల వద్దకు వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని సైలాని బాబా కాలనీ సమీపంలో బీఎల్‌వో అనిత ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. అయితే, కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు తమకు ఫొటో లేని ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వాలంటూ ఆమెతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఫారాలనే తాము పంపిణీ చేస్తామని, ఫొటోలు లేనివి ఇవ్వడం కుదరదని ఆమె స్పష్టం చేశారు.దీంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తులు బీఎల్‌ఓ చేతిలోని ఫారాలను లాక్కోవడానికి ప్రయత్నించి, ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బీఎల్‌వోలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమ పరిధిలో లేని పని చేయాలంటూ దాడికి తెగబడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఘటనపై బాధితురాలు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నరహరి తెలిపారు.

# రైతన్నకు అండగా రైతు భరోసా..

### జిల్లాలో రూ.318.42 కోట్ల నిధుల జమ

భద్రాద్రి కొత్తగూడెం: రైతులకు సాగు పెట్టుబడికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో అర్హులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.జిల్లాలో మొత్తం 1,78,828 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.318.42 కోట్ల రైతు భరోసా నిధులను నేరుగా జమ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల సమన్వయంతో పారదర్శకంగా, వేగవంతంగా నిధుల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు.రైతులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాగు పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం విడతల వారీగా నిధులను విడుదల చేస్తోందని తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా సాగు పెట్టుబడిపై రైతులకు ఆర్థిక భరోసా కల్పించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రైతు భరోసాతో పాటు రైతు బీమా, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, సాగునీటి సౌకర్యాల కల్పన వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని కలెక్టర్ వివరించారు.

బలగం TV BALAGAM





balagamtv100@gmail.com

## సంపాదకీయం

# ఇరాన్ మత పెద్ద ముజ్తబా ప్రతిన


**- నన్ను హత్య చేస్తే క్షిపణుల వర్షమే !**

**- ట్రంప్ బెదిరింపు**

టెహ్రాన్, వాషింగ్టన్ : ఇరాన్ సుప్రీం నేత, తన తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలన్నది తమ జాతి డిమాండ్ అని, తప్పకుండా అది జరిగి తీరుతుందని ఇరాన్ ప్రస్తుత మత పెద్ద ఆయతుల్లా ముజ్తబా ఖమేని శనివారం పేర్కొన్నారు. ఈ మేరకు రాతపూర్వక సందేశాన్ని టెలిగ్రామ్‌లో పోస్టు చేశారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మరణించిన ఖమేనీ అంత్యక్రియలు పూర్తయిన నేపథ్యంలో ముజ్తబా సందేశం వెలువడింది. నేరస్తులు, హంతకులు జరిపిన రెండు యుద్ధాల్లో మరణించిన అమర నాయకుడు, ఇతర అమరవీరుల రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతినచేస్తున్నామనిఆ సందేశంలో ముజ్తబా పేర్కొన్నారు.

### వేలాది క్షిపణులతో దాడులే !

తనను హత్య చేస్తానని ఇరాన్ బెదిరిస్తోందని, ఒకవేళ అదే జరిగితే ఇరాన్‌పై మూకుమ్మడిగా వెయ్యికి పైగా క్షిపణులతో దాడులు జరుగుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. వెంట వెంటనే వేలాదిగా క్షిపణుల వర్షం కురుస్తుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే తాను ఆదేశాలు కూడా జారీ చేసి వుంచానన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఆదేశాలు ఇప్పటికే జారీ అయ్యాయి. ఇరాన్‌ను సమూలంగా నిర్మూలించడానికి, నాశనం చేయడానికి ఏడాది పాటు అవసరమైతే అంతకన్నా ఎక్కువ కాలమే దాడులు చేయడానికి పూర్తి సన్నద్ధతతో అమెరికా మిలటరీ సిద్ధంగా వుంది." అని పేర్కొన్నారు. ఇక కాల్పుల విరమణ ముగిసినట్లేనని ఇరాన్‌కు ఇప్పటికే తెలియచేశామని చెప్పారు. అయితే చర్చలు కొనసాగించాలని వారు కోరారు. అందుకు అమెరికా అంగీకారం తెలిపిందన్నారు. కాగా ఈ వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. అటువంటి అభ్యర్థనేదీ తాము చేయలేదని తెలిపింది. అయితే చర్చల కోసం మధ్యవర్తి ఖతార్ చేసిన అభ్యర్ధనను తాము తోసిపుచ్చలేదని పేర్కొంది. గత వారమంతా ఇరాన్‌పై అమెరికా పదేపదే



దాడులు జరిపింది. ఇందుకు ప్రతిగా ఇరాన్ కూడా అమెరికా మిలటరీ స్థావరాలపై దాడులు జరిపింది. అమెరికా, ఇరాన్ చర్చలపై ట్రంప్‌తో సౌదీ యువరాజు, ప్రధాని మహ్మద్ బిన్ సల్మాన్ అల్ సద్ ఫోన్‌లో మాట్లాడారు. సౌదీ-అమెరికా సహకారం, వివిధ రంగాల్లో దాన్ని పెంచుకునే విషయమై ఉభయ పక్షాలు చర్చలు జరిపాయని సౌదీ పత్రికా సంస్థ తెలిపింది. సముద్ర మార్గాల భద్రత, ప్రాంతీయ భద్రత, సుస్థిరతకు దోహదపడే ఇతర అంశాలు, కృషి గురించి కూడా వారు చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు హర్మూజ్‌పై చర్చించేందుకు గానూ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి శనివారం ఒమన్ బయలుదేరి వెళ్ళారు.

## రాష్ట్ర స్థాయి అత్యపత్య క్రీడలు ఘనంగా ప్రారంభం

- **20 జిల్లాల నుంచి తరలివచ్చిన సబ్ జూనియర్ బాలబాలికలు**
- **చిన్నకోడూరు జెడ్పీహెచ్ఎస్ వేదికగా రెండు రోజుల రాష్ట్ర ఛాంపియన్‌షిప్**

**చిన్నకోడూరు, జూలై 11:** సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) వేదికగా తెలంగాణ రాష్ట్ర అత్యపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ బాల, బాలికల రాష్ట్ర స్థాయి అత్యపత్య ఛాంపియన్‌షిప్--2026 శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ రెండు రోజుల పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి వందలాది మంది బాలబాలికలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ అంజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహి ంచబడింది. అతిథులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతమైన చిన్నకోడూరులో రాష్ట్ర స్థాయి క్రీడలను నిర్వహించడం ఆనందకర విషయమని, ఇలాంటి పోటీలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూరు ఎస్ఐ చంద్ర మోహన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజి, రాష్ట్ర కార్యదర్శి ముకేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాముని శ్రీనివాస్, జిల్లా చైర్మన్ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, ఎంఈఓ తిరుపతి, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, పీటీ బిక్షపతి, అశోక్, జిల్లా అధ్యక్షుడు ఇప్ప నర్సింహా నాయుడు, వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి బుస్సా మహేష్, ఉప కార్యదర్శి వెంకటేష్, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతి మంత్రం

మధ్యప్రాచ్యంలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. హోర్ముజ్ జలసంధిలో అంతర్జాతీయ చమురు నౌకలపై జరిగిన దాడులకు ప్రతిచర్యగా అమెరికా సైన్యం ఇరాన్‌పై వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఇరాన్‌కు చెందిన సుమారు 80 వ్యూహాత్మక సైనిక స్థావనాలపై క్షిపణులతో దాడులు చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో పశ్చిమాసియా, మధ్యప్రాచ్యం మధ్య ఉద్రిక్తతలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. గల్ఫ్ రీజియన్‌లో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు వ్యక్తమవుతున్నాయి. వీటిని నివారించే దిశగా పాకిస్తాన్ ముందడుగు వేసింది. అమెరికా, ఇరాన్ మధ్య స్తంభించిపోయిన శాంతి చర్చల ప్రక్రియను పునరుద్ధరించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. ఈ క్రమంలో పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్.. సంప్రదింపులు ప్రారంభించారు. మధ్యవర్తిత్వం వహించడానికి, ఇస్లామాబాద్ వేదికగా అమెరికా- ఇరాన్ ప్రతినిధుల మధ్య శాంతి చర్చలు నిర్వహించడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఇందులో ఎటువంటి రాజీ ధోరణీ ఉండబోదని తేల్చి చెప్పారు. దీనిపై పాకిస్తాన్ ప్రధానమంత్రి కార్యాలయం ఓ అధికారిక ప్రకటన జారీ చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో జరిపిన సంభాషణకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. పశ్చిమాసియాలో తిరిగి చోటు చేసుకుంటోన్న ఉద్రిక్తతలపై ప్రధానమంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని తెలిపింది. శాంతియుత వాతావరణంలో చర్చలను పునరుద్ధరించాల్సిన తక్షణ అవసరం ఉందని షెహబాజ్ షరీఫ్ స్పష్టం చేసినట్లు వివరించింది. నాలుగైదు నెలలుగా కష్టపడి సాధించిన శాంతియుత ప్రక్రియ, దౌత్య సంబంధాల పునరుద్ధరణను ప్రమాదంలో పడేసే ఎలాంటి చర్యలకైనా దూరంగా ఉండాలని, సంయమనం పాటించాలని షెహబాజ్ షరీఫ్ ఈ సందర్భంగా అమెరికా,



ఇరాన్ ను కోరారు. గతంలో ఇస్లామాబాద్ లో కుదిరిన అవగాహన ఒప్పందం కింద చేపట్టిన చర్యలు, రూపొందించుకున్న కట్టుబాట్లను నిలబెట్టుకోవాల్సిన ప్రాముఖ్యతను షరీఫ్ గుర్తు చేశారు. పశ్చిమాసియాలో ఉమ్మడి శ్రేయస్సును పెంపొందించడానికి ఓ ఫ్రేమ్ వర్క్ గా ఉపయోగపడుతుందని అభివర్ణించారు. పశ్చిమాసియాలో శాంతిని పునరుద్ధరించే విషయంలో తాము చిత్తశుద్ధితో ఉన్నామని, నిబద్ధతను ఎప్పటికప్పుడు చాటుకుంటున్నామని షరీఫ్ గుర్తు చేశారు. శాంతిచర్చలను ముమ్మరం చేయడానికి ఉద్దేశించిన ఏ ప్రయత్నానికైనా తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పెజెష్కియన్‌కు హామీ ఇచ్చారు. సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైనందుకు పెజెష్కియన్ ఈ సందర్భంగా షరీఫ్ తో పాటు ఇషాక్ దార్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, ఇతర సీనియర్ పాకిస్తానీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో షెహబాజ్ షరీఫ్ టెలిఫోన్ లో మాట్లాడారు. ఇటీవలి దాడులపై ఖతార్ ప్రజలకు సంఘీభావాన్ని తెలియజేశారు. సంయమనం పాటించాలని, ఈ రీజియన్ లో శాంతికి భంగం కలిగించే ఎలాంటి చర్యలకైనా దూరంగా ఉండాలని కోరారు. నిరంతర దౌత్య సంబంధాలు, సంభాషణల ప్రాముఖ్యత, శాంతి ఒప్పందం కింద అన్ని పక్షాలు చేసిన కట్టుబాట్లకు కట్టుబడి ఉండటంపైనా సూచించారు.


# హైదరాబాద్ టు చెన్నైకు రెండు గంటల్లోనే,

హైదరాబాద్ కేంద్రంగా రైల్వే కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణ బుల్లెట్ రైలు హబ్ గా మారనుంది. కొత్త బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రధాన మార్గాలకు ఖరారు చేసారు. రైల్వే తీసుకునే ప్రతీ నిర్ణయంలోనూ తెలంగాణకు భాగస్వామ్యం కల్పిస్తున్నామని మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. అందులో భాగంగా కీలక అంశాలను వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేసారు. రైల్వేలో వస్తున్న అనూహ్య మార్పుల గురించి వివరించారు. గత బడ్జెట్ లో ప్రకటించిన విధంగా దేశ వ్యాప్తంగా ఏడు బుల్లెట్ రైళ్లు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో మూడు హైదరాబాద్ కేంద్రంగా ఖరారు చేసినట్లు ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో రైల్వే విప్లవం నడుస్తుందని కొత్తగా సాంకేతికతను వినియోగిస్తూ.. పూర్తి స్థాయిలో అధునాతన సదుపాయాలతో రైళ్లను అందుబాటు లోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. బుల్లెట్ రైళ్లు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాల సమయంలో చేరుకోవచ్చని వివరించారు. అదే విధంగా హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాల్లో, ఇక.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని మంత్రి వివరించారు. బుల్లెట్ రైలు వ్యవస్థ దేశంలో గేమ్ ఛేంజర్ గా మారనుందని వెల్లడించారు. ఈ క్రెడిట్ తీసుకునేలా కొందరు ప్రయత్నాలు చేసారని విమర్శించారు. భారతీయ రైల్వేలో సమూల మార్పులు.. సంస్కర ణల క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని చెప్పారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే భారీ



మార్పులు వస్తాయని వివరించారు. గతంలో యూపీఏ ప్రభుత్వంలో రూ 800 కోట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తే.. మేము తెలంగాణకు 5000 కోట్ల రూపాయలు ఇచ్చామని లెక్కలు వెల్లడించారు. తెలంగాణ పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసిన బీజేపీ అధినాయకత్వం.. పలువురు కేంద్ర మంత్రులను రాష్ట్రానికి పంపుతోంది. పలు వర్గాల వారితో ఆ మంత్రులు సమావేశాలు నిర్వహిస్తూ.. బీజేపీ పాలనలో వచ్చిన మార్పులను వివరిస్తున్నారు. అందులో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ హైదరాబాద్ లో పలు సమావేశాలు నిర్వహించారు.

## ద్రోణి ప్రభావంతో వర్షాలు- ఈ జిల్లాలకు బిగ్ అలర్ట్..!!




మరోసారి వర్షాల పై బిగ్ అలర్ట్ జారీ అయింది. రుతుపవనాలు వచ్చినా ఆశించిన స్థాయిలో వర్షాలు పడటం లేదు. జూన్ నెల నామమాత్రంగానే వర్షాలు కురిసాయి. జూలై తొలి వారంలో రైతుల ఆశలు ఫలించలేదు. ఈ సమయంలో ద్రోణి కారణంగా అక్కడక్కడా వర్షాలు పడినా .. పలు ప్రాంతాల్లో ఉక్కపోత వాతావరణం నెలకొంది. తాజాగా ఐఎండీ వచ్చే రెండు రోజుల పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక, ఏపీలోనూ పలు జిల్లాల్లో వానలు కురుస్తున్నాయి. వచ్చే రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవ కాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు లతో కూడిన భారీ వానలు పడుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. విజయనగరం, భోగాపురం, రణస్థలం పరిసర ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. కాకినాడ ,కోనసీమ ,తూర్పుగోదావరి జిల్లాల్లో ఒకటి,రెండు చోట్ల పిడుగులతో తేలికపాటి వర్షాలు ఈదురుగాలులు వీస్తాయని, అప్రమత్తంగా ఉండాలని వాతవారణశాఖ ఈ జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది.

# పార్టు నొకడు బట్టి పలుమార్లు చెక్ జేసి

**ఆస్తులెల్ల గోకు నాంగ్లమందు**

**సకల పార్టు నొకడె సరిజేయు**

**హోమ్యోలో**

**సకురు అప్ప రావు సత్య మిదిర!**

భావం: ఇంగ్లీష్ వైద్య స్పెషలిస్టులు ఒక్కొక్క అవయవాన్నీ, ఒక్కొక్క జబ్బునీ ఒక్కొక్కరుగా పంచేసుకునీ, ఎవరి అవయవానికి వాళ్ళు, ఎవరి జబ్బుకు వాళ్ళు వందలకొద్దీ టెస్టులు చేయిస్తూ, ఎవరి మందు వాళ్ళు వేసుకుంటూ పోతూ, వంటగాళ్ళు ఎక్కువైతే వంట చెడినట్లు, డాక్టర్లు ఎక్కువై, పేషెంట్ల ఆరోగ్యం చెడుతోంది! ఇంతమంది డాక్టర్లను మేపడం వలన పేషెంటు ఆర్థిక పరిస్థితి కూడా చెడుతోంది! ఇలా వంద మందికి శరీరాన్ని అప్పజెప్పి, ఆరోగ్యాన్నీ, ఆదాయాన్నీ చెడగొట్టుకునేకంటే హోమియోపతీ వైద్యానికి పోతే అన్ని రకాల కష్టతరమైన, అర్థం కాని సమస్యలను సైతం ఒకే డాక్టర్ పరిష్కరించి, ఆరోగ్యాన్నీ, ఆస్తినీ కాపాడుతాడు! కాబట్టి శరీరాన్ని వంద ముక్కలుగా భావించి, వంద మంది చేతిలో పెట్టి, నాశనం కాకుండా, మొత్తం మనిషిని, అతని మనస్సునూ, జబ్బులనూ ఒకే యూనిట్ గా భావించి, ఒక్క డాక్టరే బాధ్యతగా చూస్తేనే శ్రేయస్కరం! అది హోమియోతో మాత్రమే సుసాధ్యం! సకురు అప్పారావూ ఇది అందరూ తెలుసుకోవాల్సిన నిజం!

ఈ ఆటవెలది పద్యాల శతక కవి: హోమియో వైద్యులు సకురు అప్పారావు గారు, 9848025870

(ఎంతటి కఠినమైన, అసాధ్యమైన వ్యాధులకైనా దేశంలో ఎంతటి మారుమూల గ్రామంలో ఉన్న వారికైనా, ఇంటి వద్దకే మందులు పంపుతూ, అనునిత్యం ఫోన్ ద్వారా టచ్ లో ఉంటూ, క్షణక్షణం సూచనలిస్తూ, అనేక మంది వ్యాధులను నివారణ చేస్తున్నవారు! అలాగే కుటుంబ సభ్యులలో ఎవరికి ఎటువంటి ఎమర్జెన్సీ మరియు ప్రాణాపాయ ఆపద కలిగినా,కరోనా లాంటి వైరస్ లు వ్యాప్తి చెందినా, రకరకాల జ్వరాలు వస్తూ, ఏడిపిస్తున్నా, ప్లేట్ లెట్స్ పడిపోవడం, ఆక్సిజన్ డౌన్ అవ్వడంతో హాస్పిటల్ ఐసీయూలో అడ్మిట్ అయ్యే పరిస్థితి తలెత్తినా, ఎవరికి వారే వైద్యం చేసుకుని, ఇంటిలోని అందరినీ ఏ హాస్పిటల్ కీ వెళ్ళే పని లేకుండా కాపాడుకోగలిగే సర్వరోగ నివారిణి లాంటి అమృతాన్ని కనిపెట్టి, "సకురు అప్పారావు గారి 1,2,3 ఫార్ములా ఫామిలీ కిట్" అనే పేరుతో ప్రజలకు అందిస్తున్నవారు!)

## దర్యాప్తులో పక్కా నిఘా..

# కన్విక్షన్ రేటు పెంచుతున్న మానిటరింగ్ సెల్



బలగం టీవి, హైదరాబాద్

కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగిస్తూ నేరస్థులకు చట్టపరమైన శిక్షలు పడేలా చేయడంలో హైదరాబాద్ నగర పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. బాధితులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్' దర్యాప్తు ప్రక్రియలో కీలక మార్పులు తీసుకువచ్చి కన్విక్షన్ రేటు పెరగడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది.

ఈ సెల్ క్షేత్రస్థాయి దర్యాప్తును నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు మార్గదర్శకత్వం అందిస్తోంది. శాస్త్రీయ ఆధారాల సేకరణ, డిజిటల్ మరియు ఫోరెన్సిక్ సాక్ష్యాల వినియోగం, సాక్షుల గుర్తింపు వంటి అంశాల్లో ప్రత్యేక పద్ధతులను అనుసరించడం వల్ల కోర్టుల్లో కేసులు బలంగా నిలబడుతున్నాయి. ముఖ్యంగా పోక్సో, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఈ విభాగం ప్రాధాన్యత ఇస్తోంది.

ఇటీవల సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బాలుడి హత్య కేసులో నిందితుడికి మరణశిక్ష విధించడంలో ఈ మానిటరింగ్ సెల్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు నుంచే కేసును నిశితంగా పరిశీలించి, ఎటువంటి లోపాలు లేకుండా సాక్ష్యాధారాలు సేకరించడం వల్లే కోర్టుల్లో నేరం రుజువై కఠిన శిక్షలు విధించబడుతున్నాయని పేర్కొన్నారు.

గతంలో సమయాభావం, సాంకేతిక పరిజ్ఞానం కొరత కారణంగా కొన్ని కేసుల్లో చిన్నపాటి లోపాలు చోటుచేసుకుని నిందితులు తప్పించుకునే అవకాశాలు ఉండేవి. ఈ పరిస్థితిని మార్చేందుకు అనుభవజ్ఞులైన పోలీసు అధికారులు, న్యాయ నిపుణులతో కూడిన మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఇది దర్యాప్తు అధికారులకు దిక్సూచిలా పనిచేస్తూ, నిర్దేశిత గడువులో చార్జ్‌షీట్లు దాఖలు అయ్యేలా పర్యవేక్షిస్తోంది. అలాగే పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ కోర్టు విచారణ సజావుగా సాగేలా చూస్తోంది.

గడచిన ఆరు నెలల్లో గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులు కలిపి మొత్తం 2,469 కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు ఖరారు చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో 20 ఏళ్లకు పైగా శిక్షలు 18 కేసుల్లో, జీవిత ఖైదులు 12 కేసుల్లో, ఒక కేసులో ఉరిశిక్ష విధించబడింది. ఈ గణాంకాలు పోలీసుల దర్యాప్తు శైలిలో వచ్చిన మార్పులకు నిదర్శనంగా అధికారులు పేర్కొంటున్నారు.

ట్రయల్ దశలో కూడా కేసుల పర్యవేక్షణను కట్టుదిట్టం చేశారు. ప్రతి కోర్టుకు ప్రత్యేక లైజన్ అధికారిని నియమించి, సాక్ష్యాధారాల సమర్పణ, సాక్షుల హాజరు వంటి అంశాలను సమన్వయం చేస్తున్నారు. నిందితులకు శిక్ష పడే వరకు ప్రతి కేసును క్లోజ్‌గా మానిటర్ చేయడం వల్ల నేర నిరూపణ శాతం గణనీయంగా పెరుగుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ, బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగినప్పుడే పోలీసింగ్ వ్యవస్థకు సార్థకత చేకూరుతుందని అన్నారు. సాంప్రదాయ దర్యాప్తు పద్ధతులతో పాటు ఆధునిక శాస్త్రీయ ఆధారాలను మేళవించడం వల్లే కోర్టుల్లో నేర నిరూపణ సాధ్యమవుతోందని, రాబోయే రోజుల్లో సాంకేతిక సవాళ్లను ఎదుర్కొంటూ శాంతిభద్రతల పరిరక్షణలో మరింత పటిష్టంగా వ్యవహరిస్తామని తెలిపారు.

# కురిసిన ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసిపట్టాలి!

**ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవాలి**

**వర్షపు నీటి సంరక్షణ ప్రతి అపార్ట్‌మెంట్ బాధ్యత కావాలి**

**గుట్టల బేగంపేటలో 'ఇంజక్షన్ బోర్ వెల్'**

**ప్రారంభించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**




బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న తాగునీటి అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వర్షపు నీటి సంరక్షణను ఒక తప్పనిసరి సామాజిక బాధ్యతగా స్వీకరించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుట్టల బేగంపేటలోని బీవర్లీ హిల్స్ (బీవర్లీ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్) ఆధ్వర్యంలో పునర్నిర్మించిన మూడు ఇంకుడు గుంతలను, అలాగే మరో పాడైపోయిన బోరుబావిని డ్రిల్లింగ్ చేసి 'ఇంజెక్షన్ బోర్'గా మార్చిన నూతన రీచార్జ్ వ్యవస్థను ఆయన అధికారికంగా ప్రారంభించారు. అనంతరం అపార్ట్‌మెంట్ వాసులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

**నామమాత్రంగా వద్దు.. శాస్త్రీయంగా నిర్మించండి**

ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను కేవలం భవన నిర్మాణ అనుమతులు లేదా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం నామమాత్రంగా ఏర్పాటు చేసి వదిలేయవద్దని స్పష్టం చేశారు. ప్రతి భవనం పైకప్పుపై కురిసే వర్షపు నీటి ప్రతి చుక్కను అదే ప్రాంగణంలో భూమిలోకి ఇంకేలా శాస్త్రీయ పద్ధతిలో రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు, రీఛార్జ్ పిట్లను నిర్మించాలని సూచించారు. ప్రభుత్వం, జలమండలి తీసుకునే చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే నగరానికి శాశ్వత నీటి భద్రత సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

**జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ**

గతంలో 300 గజాల స్థలంలో ఒకే కుటుంబం నివసించగా, ప్రస్తుతం అదే విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనాలు (అపార్ట్‌మెంట్లు) ఏర్పడి అనేక కుటుంబాలు నివసిస్తున్నాయని, దీనివల్ల నీటి అవసరం వందల రెట్లు పెరిగిందని ఎండీ వివరించారు. ఈ జనాభా పెరుగుదలకు అనుగుణంగా పంపిణీ లైన్లు, రిజర్వాయర్లు, పంపింగ్ వ్యవస్థలను జలమండలి దశలవారీగా అభివృద్ధి చేస్తోందన్నారు. కృష్ణా, గోదావరి వంటి సుదూర ప్రాంతాల నుంచి భారీ విద్యుత్ వ్యయంతో నీటిని పంపింగ్ చేస్తున్నామని, నగరానికి నీటి సరఫరా నిలిచిపోకుండా సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని తెలిపారు.

నగరంలో నీటి కొరత తీవ్రతను వివరిస్తూ ఎండీ కొన్ని కీలక గణాంకాలను వెల్లడించారు:

గత ఏడాది వేసవిలో: సుమారు 4,000 అపార్ట్‌మెంట్లు జలమండలి ట్యాంకర్ నీటిని వినియోగించాయి.

ఈ ఏడాది వేసవిలో: ఆ సంఖ్య ఏకంగా 12,500 అపార్ట్‌మెంట్లకు పెరిగింది.

కొత్త ప్రాంతాల్లో డిమాండ్: గతంలో కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, ఎస్.ఆర్.నగర్‌లలో డిమాండ్ ఎక్కువగా ఉండేది. కానీ ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో సాధారణంగా నీటి సమస్య లేని ఉప్పల్, ఎల్బీనగర్, ఎన్‌టీఆర్‌నగర్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ట్యాంకర్ల డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. వర్షాలు ఆలస్యం కావడం, భూగర్భ జలాలు పడిపోవడమే దీనికి ప్రధాన కారణం.

**ప్రజల భాగస్వామ్యంతోనే శాశ్వత పరిష్కారం**

పైప్‌లైన్ ద్వారా అందించే నీటికి ట్యాంకర్ సరఫరాను శాశ్వత ప్రత్యామ్నాయంగా భావించరాదు.

అపార్ట్‌మెంట్ సంఘాలు నీటి వినియోగంపై ఆడిట్ నిర్వహించాలి, లీకేజీలను అరికట్టాలి.

పాడైన బోరుబావులను రీఛార్జ్ పిట్లుగా (ఇంజెక్షన్ బోర్లుగా) మార్చడం ద్వారా బోర్లలో నీటి లభ్యత పెరిగి, కనీసం కొన్ని నెలలపాటు ట్యాంకర్ల అవసరం తప్పుతుంది.

**బీవర్లీ హిల్స్ అసోసియేషన్‌కు అభినందనలు**

బీవర్లీ హిల్స్ లోని అపార్ట్‌మెంట్ వాసులు స్వచ్ఛందంగా చేపట్టిన ఈ వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాన్ని ఎండీ అభినందించారు. వచ్చే ఏడాది నాటికి ఈ కాలనీ ట్యాంకర్ నీటి అవసరం లేని ఆదర్శ కాలనీగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ రీజినల్ ఈడీ సంతోష్, డైరెక్టర్ నారాయణ, జీఎం హరి శంకర్, ఇంకుడుగుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ మరియు అపార్టుమెంటు అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వాయుసేనల ర్యాంకింగ్స్‌లో భారత్‌కు మూడో స్థానం

బలగం టీవి, న్యూఢిల్లీ

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వాయుసేనల జాబితాలో భారత వాయుసేన (ఐఏఎఫ్) మరోసారి తన సత్తా చాటింది. వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడరన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ (డబ్ల్యుడీఎంఎంఏ) విడుదల చేసిన 2026 గ్లోబల్ ఎయిర్ పవర్ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. వరుసగా ఐదో ఏడాది కూడా చైనాను వెనక్కి నెట్టి ఆధిపత్యాన్ని కొనసాగించింది.

ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికాకు చెందిన వివిధ వైమానిక విభాగాలు అగ్రస్థానంలో నిలవగా, రష్యా రెండో స్థానాన్ని దక్కించుకుంది. స్వతంత్ర జాతీయ వాయుసేనల పరంగా పరిశీలిస్తే అమెరికా, రష్యాల తర్వాత ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన వాయుసేనగా భారత్ నిలిచినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. డబ్ల్యుడీఎంఎంఏ రూపొందించిన 'ట్రూ వాల్యూ రేటింగ్' (టీవీఆర్) ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించారు. ఇందులో భారత వాయుసేన 69.4 పాయింట్లు సాధించగా, చైనా వాయుసేన 63.8 పాయింట్లతో వెనుకబడింది.

విమానాల సంఖ్యతో పాటు వాటి సాంకేతిక సామర్థ్యం, పైలట్ల శిక్షణ, లాజిస్టిక్స్, ఆధునికీకరణ, భవిష్యత్ ప్రణాళికలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు నిర్ణయించినట్లు డబ్ల్యుడీఎంఎంఏ వెల్లడించింది. భారత వాయుసేన వద్ద ప్రస్తుతం సుమారు 1,716 విమానాలు ఉన్నాయి. ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లు, రవాణా విమానాలు సమతూకంగా ఉండటం వల్లే చైనా కంటే మెరుగైన స్థానం దక్కినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, భారత వాయుసేన ముందున్న ప్రధాన సవాల్ ఫైటర్ స్క్వాడ్రన్ల కొరత. దేశ రక్షణ అవసరాలకు 42 ఫైటర్ స్క్వాడ్రన్లు అవసరమవుతుండగా, ప్రస్తుతం 29 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ లోటును భర్తీ చేసేందుకు 180 తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాల కొనుగోలుతో పాటు స్వదేశీ సాంకేతికతతో యుద్ధ విమానాల తయారీ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# 'సర్' ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలి

**సీఈవో సుదర్శన్ రెడ్డి**

బలగం టీవి, హైదరాబాద్

ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల పూరణలో అవగాహన కల్పించడంతో పాటు ప్రక్రియ సజావుగా సాగుతోందా అనే అంశాన్ని ఆయన శనివారం స్వయంగా పర్యవేక్షించారు.

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఫారాల పంపిణీ, తిరిగి స్వీకరణ సక్రమంగా నిర్వహిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి, ఫారాల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారాల డిజిటలైజేషన్ ఎలా జరుగుతోందో ఆపరేటర్లను అడిగి తెలుసుకుని, అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. బీఎల్‌వోలు ఓటర్ల నుంచి స్వీకరించిన ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని స్పష్టం చేశారు. అదే ప్రాంతంలోని అపార్టుమెంట్లలో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఫారాల అప్‌లోడింగ్, పూరించిన ఫారాల స్వీకరణ ప్రక్రియను కూడా సీఈవో పరిశీలించారు. ఓటర్లకు ఫారాలు పూరించడంలో అవసరమైన సహాయం అందించడంతో పాటు, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను ఫోన్ ద్వారా సేకరించి వారికి ఫారాలు అందించాలని సూచించారు. బీఎల్‌వోలకు కేటాయించిన ప్రాంతాల్లో అందుబాటులో లేని వారి వివరాలను సూపర్వైజర్లకు తెలియజేయాలని ఆదేశించారు.

2002లో జాబితాలో లేని వారి ఫారాలు ఎలా పూరించాలో కూడా సుదర్శన్ రెడ్డి వివరించారు. అనంతరం కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని అపార్టుమెంట్లలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియలో భాగంగా ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి బీఎల్‌వోల పనితీరును సమీక్షించారు. ఈ పర్యటనలో కూకట్పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, కూకట్పల్లి ఎమ్మార్వో అశోక్, డీసీ ఆంజనేయులు, సూపర్వైజర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ పాయింట్ల సవరణతో మాలలకు న్యాయం చేయాలి

**మంత్రి గడ్డం వివేక్**


బలగం టీవి, హైదరాబాద్

రోస్టర్ పాయింట్లలో ఉన్న లోపాలను వెంటనే సవరించి మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఖైరతాబాద్‌లోని చింతలబస్తీలో ది నేషనల్ అంబేద్కర్ సేన అధ్యక్షుడు మన్నె శ్రీధర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించిన మంత్రి, దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తూ మాలలను మూడో గ్రూపులో చేర్చి 5 శాతం రిజర్వేషన్ కల్పించిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత రోస్టర్ విధానంలో మాలలకు 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం వల్ల వారికి దక్కాల్సిన పూర్తి ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నారు. 5 శాతం రిజర్వేషన్‌కు బదులుగా కేవలం 2.8 శాతం అవకాశాలే లభిస్తున్నాయని, దీంతో ఉద్యోగాలు, నియామకాలలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లోపాన్ని సవరించి రోస్టర్ పాయింట్లను పునర్వ్యవస్థీకరించడం ద్వారా రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ఇప్పటికే తాను మూడుసార్లు క్యాబినెట్‌లో ప్రస్తావించానని, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం దీనిపై స్పందించి క్యాబినెట్ సబ్ కమిటీ ద్వారా సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించిందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ, సీతక్క తదితరులతో ఈ అంశంపై చర్చించినట్లు వెల్లడించారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ స్పష్టంగా హామీ ఇచ్చిందని గుర్తు చేసిన మంత్రి, అదనంగా పెరిగే 3 శాతం రిజర్వేషన్ల ద్వారా మాలలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మాలలకు జరుగుతున్న అన్యాయం సరిదిద్దే వరకు తాను ప్రభుత్వంలో నిరంతరం పోరాడుతానని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. మాలలంతా ఐక్యంగా ఉద్యమించినప్పుడే తమ హక్కులను సాధించుకోగలరని పిలుపునిచ్చారు.

## గిర్నార్ కొండపై విషాదం.. బాలుడిని చంపిన సింహం

బలగం టీవి, న్యూఢిల్లీ



గుజరాత్‌లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం గిర్నార్ కొండపై విషాదకర ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వెళ్లిన 11 ఏళ్ల బాలుడిపై సింహం దాడి చేసి ప్రాణాలు తీసింది. శనివారం తెల్లవారుజామున వందలాది మంది భక్తుల సమక్షంలో ఈ ఘటన జరగడంతో యాత్రికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఘటన అనంతరం గిర్నార్ యాత్రను అటవీ శాఖ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

ఖేడా జిల్లాకు చెందిన మయూర్ చౌహాన్ (11) కుటుంబ సభ్యులతో కలిసి గిర్నార్ కొండను ఎక్కుతుండగా ప్రమాదం సంభవించింది. యాత్ర మార్గంలోని 50వ మెట్టు సమీపానికి చేరుకున్న సమయంలో పొదల్లో మాటు వేసిన సింహం ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసి అడవిలోకి లాక్కెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కుటుంబ సభ్యులు, ఇతర యాత్రికులు కేకలు వేసినా బాలుడిని రక్షించలేకపోయారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. దాడి జరిగిన ప్రాంతానికి సుమారు 100 మీటర్ల దూరంలో బాలుడి శరీర భాగాలను గుర్తించారు. అనంతరం అక్కడ సంచరిస్తున్న మూడు సింహాలను బంధించి సక్కర్‌బాగ్ జూకు తరలించారు. వాటిలో ఒక సింహం బాలుడి శరీర భాగాలను బయటికి కక్కినట్లు అధికారులు తెలిపారు. అదే దాడికి పాల్పడిన సింహమని వారు నిర్ధారించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తదుపరి ఆదేశాలు వెలువడే వరకు గిర్నార్ యాత్రను నిలిపివేస్తున్నట్లు అటవీ శాఖ ప్రకటించింది. సౌరాష్ట్ర ప్రాంతంలో ఇటీవల వన్యప్రాణుల దాడులు పెరుగుతున్నాయని, కొద్ది రోజుల క్రితం భావ్‌నగర్ జిల్లాలో చిరుత దాడిలో మరో బాలుడు మరణించిన ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## 22 ఏళ్లుగా అక్రమంగా ఉంటున్న పాకిస్థాన్ తల్లికొడుకుల అరెస్టు

బలగం టీవి, న్యూఢిల్లీ

కర్ణాటకలో గత 22 ఏళ్లుగా అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులైన తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి తాలూకాలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశం విడిచి వెళ్లకుండా నకిలీ పత్రాలతో భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాగేపల్లి సమీపంలోని దాసగరిపల్లి గ్రామంలో నివసిస్తున్న ఫర్హానాజ్ , ఆమె కుమారుడు మహమ్మద్ ఫర్దీన్ రేషన్ కార్డు పొందడంతో పాటు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారు సమర్పించిన పత్రాలపై రెవెన్యూ అధికారులకు అనుమానం కలగడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆ విచారణలో వారు భారత పౌరసత్వం లేని పాకిస్థాన్ జాతీయులని నిర్ధారణ అయింది.

పోలీసుల వివరాల ప్రకారం, పాకిస్థాన్ జాతీయురాలైన ఫర్హానాజ్‌కు దాసగరిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అయూబ్ ఖాన్‌తో 2003లో వివాహం జరిగింది. వీరి కుమారుడు ఫర్దీన్ పాకిస్థాన్‌లో జన్మించినట్లు గుర్తించారు. తరువాత ఈ కుటుంబం భారత్‌లో స్థిరపడింది. అయితే వీసా గడువు ముగిసిన అనంతరం కూడా పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లకుండా, బెంగళూరు చిరునామాలను ఉపయోగించి నకిలీ ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బ్యాంకు ఖాతాలు తెరిచినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తల్లికొడుకులను అదుపులోకి తీసుకున్నారు. నకిలీ పత్రాల జారీ వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## రేపటి నుంచి ఓయూ హాస్టల్, మెస్ కార్మికుల సమ్మె

బలగం టీవి, హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) హాస్టల్ మరియు మెస్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు జూలై 13 నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ప్రకటించింది. ఓయూ గౌరవ అధ్యక్షురాలు ఎస్.ఎల్. పద్మ, అధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్, కార్యదర్శి శివాజీ శనివారం వివిధ హాస్టళ్లలో కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన కనీస వేతనాలు అమలు కావడం లేదని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వీక్లీ ఆఫ్, 20 రోజులకు ఒక క్యాజువల్ లీవ్, జాతీయ పండుగలు లేదా పండుగల రోజుల్లో సెలవులు ఇవ్వడం, డబుల్ జీతం చెల్లించడం వంటి కార్మిక హక్కులు అమలు కావడం లేదన్నారు. 2022 నుంచి వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (వీడీఏ) కూడా అమలు చేయకపోవడంతో అత్యల్ప వేతనాలకు పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కమిషనర్ ఈ అంశాలపై విశ్వవిద్యాలయానికి లేఖ రాసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. యూనివర్సిటీ అధికారులు వెంటనే స్పందించి జీతాలు పెంచాలని, కార్మికులకు రావాల్సిన హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూలై 13 నుంచి మెస్‌లను మూసివేసి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను అర్థం చేసుకుని సహకరించాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. సమావేశంలో నాయకులు విజయ, శంకర్, వెంకటేష్, ప్రవీణ్, సత్యం, అనిత, సావిత్రి, జయ, పద్మ, సామ్రాజ్య, కృష్ణ, భూమయ్య, బాబా, మల్లికార్జున్, అనిల్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

బలగం టీవి, హైదరాబాద్



తెలంగాణలో పోక్సో కేసుల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, షాబాద్‌లో జరిగిన బహుళ హత్యల ఘటనను ప్రస్తావించి, నిందితుడు ఇంకా పరారీలో ఉండటం తీవ్ర ఆందోళనకరమన్నారు.

హైదరాబాద్, రంగారెడ్డి, చేవెళ్ల, వికారాబాద్ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిందితుడి గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోక్సో కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బెయిల్ వ్యవహారాలను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. పేట్‌బషీరాబాద్ పోక్సో కేసులో బాధితురాలి కుటుంబ సభ్యులు భయాందోళనలో ఉన్నారని, నిందితుడిపై సమగ్ర దర్యాప్తు జరగాలని అన్నారు. బాధితులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. షాబాద్ కేసులో మే 16న నమోదు అయిన కేసులో నిందితుడు జూన్‌లో బెయిల్ పొందిన అనంతరం జూలై 10న ఆరుగురిని హత్య చేశాడని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోక్సో కేసులపై ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించాలని కోరారు. పోక్సో కేసుల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, విచారణను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల స్టేట్‌మెంట్ల నమోదు, మహిళా పోలీసుల ద్వారా విచారణ, నిందితుల నేర చరిత్ర పరిశీలన వంటి అంశాల్లో లోపాలు ఉండకూడదన్నారు. ప్రజలు, తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించి, వేధింపులపై వెంటనే స్పందించాలని సూచించారు. విద్యార్థినులు ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కడారి స్వామి యాదవ్, గోపగాని రఘురాం, పావని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెర్ల-2 కేటాయింపుతో సింగరేణికి కొత్త ఊపిరి: బీజేపీ

బలగం టీవి, హైదరాబాద్

తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలంపాట లేకుండా నేరుగా సింగరేణికి కేటాయించడం సంస్థ భవిష్యత్తుకు కీలక నిర్ణయమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ రావు అన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యంతో రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాడిచెర్ల-2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు, విద్యుత్ కొనుగోలు చేస్తున్నప్పటికీ, సకాలంలో బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం సుమారు రూ.54 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందన్నారు. దీనివల్ల కొత్త యంత్రాలు కొనుగోలు చేయడం, ఆధునిక సాంకేతికతపై పెట్టుబడులు పెట్టడం, కార్మికులకు మౌలిక వసతులు కల్పించడం కష్టమైందని పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు తాడిచెర్ల-2 బ్లాక్ ద్వారా సింగరేణికి భారీ ఆదాయం లభించనున్నదని తెలిపారు. ఈ బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. దీని ద్వారా సింగరేణికి రూ.64 వేల కోట్ల అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.

అలాగే కొత్తగా 1,200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించబడతాయని, ఆక్షన్ ప్రీమియం రూపంలో చెల్లించాల్సిన రూ.200 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీతో పాటు సింగరేణిలో ఉన్న 51 శాతం వాటా కారణంగా అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు.సింగరేణి కార్మికులకు భరోసా కల్పించేందుకు జూలై 13, 14 తేదీల్లో 'సింగరేణి భరోసా యాత్ర' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, బీజెఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్షనేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని చెప్పారు. ఈ యాత్రలో కొత్తగూడెం, భూపాలపల్లి, గోదావరిఖని, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో కార్మికులతో గేట్ మీటింగ్‌లు నిర్వహించి, చివరగా మందమర్రి-చెన్నూరు ప్రాంతంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న 41 వేల మంది శాశ్వత కార్మికులు, 30 వేల మంది కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పడమే యాత్ర ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# రామమందిరంలో చోరీలకు నిరసనగా "వీహెచ్" మౌనదీక్ష..



**-సంఘీభావం ప్రకటించిన ప్రభుత్వ విప్ ఆది, ఎమ్మెల్యే కవ్వంపల్లి..**

**బలగం టీవీ,ఇల్లంతకుంట:**

అయోధ్య రామమందిరం విరాళాల చోరీ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యవహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రామోజీపేట గ్రామంలో మౌన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాముడు సత్యానికి, ధర్మానికి ప్రతీక అని, ఆయన పేరుతో అక్రమాలు చేస్తే ప్రజలు సహించరని అన్నారు .. ఈ దీక్ష ద్వారా కేంద్రానికి కనువిప్పు కలిగించాలన్నదే తమ ఉద్దేశం" అని అన్నారు. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రమైనదిగా భావించే అయోధ్య రామమందిరంలో నిధుల చౌర్యం వ్యవహారం భక్తులను కలవరపర్చిందన్నారు. ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరదించుతూ 2024 జనవరిలో అయోధ్య రామమందిరం ప్రారంభం కాగా, కేవలం రెండున్నర ఏళ్లలోనే ఈ విధమైన ఘటనలు చోటుచేసుకోవడం భక్తులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దోషులకు శిక్ష పడాల్సిందేనన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, "రాముడి పేరుతో భక్తుల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయల విరాళాలు స్వాహా కావడం, భక్తితో ఇచ్చిన కానుకలను దొంగిలించడం వల్ల భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్ని అన్నారు . రామనామాన్ని నిత్యం స్మరించే కమలనాథులు రామ మందిరంలో జరిగిన చోరీలపై చోద్యం చూడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. "రామ మందిరం అనేది కోట్లాది హిందువుల ఆత్మగౌరవానికి, విశ్వాసానికి సంబంధించిన అంశమని, అలాంటి పవిత్ర కార్యక్రమంలో జరిగిన భారీ అవినీతిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం దాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మతాలకు, విశ్వాసాలకు వ్యతిరేకం కాదని, మతం పేరుతో జరిగే దోపిడీని, మోసాన్ని కాంగ్రెస్ పార్టీ సహించబోదని అన్నారు . రాముడి పేరును రాజకీయాలకు, దోపిడీకి ఉపయోగించడం కమలనాథులకు క్షంతవ్యం కాదని పేర్కొన్నారు. కేంద్రం వెంటనే స్పందించి విరాళాల లెక్కలను బహిర్గతం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, చైతన్య మహేందర్ రెడ్డి,పార్టీ నాయకులు వూట్కూరి వెంకటరమణారెడ్డి, గడ్డం నర్సయ్య, అలువాల కోటి, పసుల వెంకటి,తోపాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు,



# మేనమామను హత్య చేసిన మేనల్లుడు..

**- ఆస్తి కోసం హత్య.. నిందితుడు అరెస్ట్**

**- సిరిసిల్ల టౌన్ సిఐ శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

మద్యం వ్యసనానికి బానిసై, జల్సాలకు అలవాటుపడిన ఓ మేనల్లుడు, ఆస్తిపై ఆశతో కన్న మేనమామనే అతి కిరాతకంగా హతమార్చిన ఘటన సిరిసిల్లలో తీవ్ర కలకలం రేపింది. నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ?వేములవాడకు చెందిన పుప్పాల శ్రీకాంత్ (35), మద్యానికి బానిసై జల్సాల కోసం నిత్యం గొడవలకు దిగేవాడని అన్నారు.ఐదు నెలల క్రితం తనను మందలించినందుకు మేనమామ రాగుల ఎల్లయ్యపై కక్ష పెంచుకున్నాడని,ఎల్లయ్యకు భార్య, పిల్లలు లేరని గ్రహించిన శ్రీకాంత్, అతన్ని చంపితే ఆ ఇల్లు తనకు దక్కుతుందని, దాన్ని అమ్మి జల్సాలు చేయవచ్చని పక్కా ప్లాన్ వేశాడని అన్నారు.

?ఈ నెల 4న మేనమామ ఎల్లయ్యను నమ్మించి పెద్దూరు శివారుకు తీసుకెళ్లి మద్యం తాగించి, మత్తులో ఉండగా గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించగా,బాధితుడు ప్రతిఘటించడంతో బండరాయితో తలపై బలంగా కొట్టి హతమార్చాడని అన్నారు. మృతదేహంపై బట్టలు కప్పి పరారైన నిందితుడు, హైదరాబాద్‌కు పారిపోయే ప్రయత్నంలో ఉండగా ఎల్లమ్మ చౌక్ వద్ద పోలీసులకు దొరకగా,నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించాలి...

**బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు రవి గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు రవి గౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ ఎస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో రవి గౌడ్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మున్ననూరు ప్రాజెక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకులంలో కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో ఆహార నాణ్యతను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి గురుకులంలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్యాన్ని బీఆర్ఎస్వీ తీవ్రంగా ఖండిస్తోందని, గురుకుల విద్యార్థుల భద్రత విషయంలో




ప్రభుత్వం ఇకనైనా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,. మట్టి శ్రీనివాస్. సబల శేఖర్. బల్యాల ప్రవీణ్. బక్కని వేణు గోపాల్ యాదవ్. ఎస్.కె జూనియర్. శివ. అనురాగ్. తదితరులు పాల్గొన్నారు

# సీనియర్ జర్నలిస్టు గజ్జెల శ్రీనివాస్ కన్నుమూత

**పాత్రికేయ రంగానికి తీరని లోటు**

**బలగం టీవీ, బోయినిపల్లి;**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గజ్జెల శ్రీనివాస్ శనివారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మరణం పాత్రికేయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.శనివారం రోజున సాయంత్రం సుమారు 5:30 గంటలకు ఆయనకు కరీంనగర్‌లోనీ ఓ ఆసుపత్రిలో చికిత్స చేస్తుండగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.నిర్భయంగా, నిష్పక్షికంగా వార్తలను ప్రజలకు అందించడంలో గజ్జెల శ్రీనివాస్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని సహచర జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పేర్కొంటూ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.గజ్జెల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ప్రార్థించారు.జర్నలిస్ట్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని పలువురు కోరారు.శ్రీనివాస్ కు భార్య అమృత,కూతుర్లు 16 ఏండ్ల భార్గవి, 12 ఏండ్ల సాయి శరణ్య, 7 ఏండ్ల సృజన్ లు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఘనంగా బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు




**బలగం టీవీ, బోయినిపల్లి;**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు పురస్కరించుకుని శనివారం రోజున భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నేతృత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణకు తమ అంకితభావాన్ని చాటుతూ మొక్కలు నాటి బండి సంజయ్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ:ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, అవినీతి మరియు కుటుంబ పాలనకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న ధైర్యవంతుడైన నాయకుడు బండి సంజయ్ కుమార్. సాధారణ కార్యకర్త స్థాయి నుండి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎదిగిన ఆయన జీవితం ప్రతి బీజేపీ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేస్తున్న పోరాటం చిరస్మరణీయం అని కొనియాడారు. భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కావడానికి ఆయన నాయకత్వం కీలక శక్తిగా నిలుస్తోందని, భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించి, మరెన్నో సంవత్సరాలు దేశసేవ, సమాజసేవ చేసే శక్తిని ఇవ్వాలని మనసారా కోరుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి,స్థంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మెరుపుల గంగాధర్ గౌడ్,రాజేంద్రప్రసాద్, మండల ఉపాధ్యక్షులు అన్నిమల్ల మోహన్ బాబు,పసికంటి వెంకటేష్, కందారపు వెంకటేష్, ఇల్లందుల బాలయ్య, కిసాన్మోర్చ మండల అధ్యక్షులు జువ్వెత్తుల శ్రీనివాస్ రెడ్డి,యువమోర్చ మండల అధ్యక్షులు మిరియాల శరత్ చంద్రరెడ్డి, సీనియర్ నాయకులు భోగోజీ గంగాధర్ చారి, మినుకుల శ్రీనివాస్, సారంపల్లి రాజు,అమీర్శెట్టి గంగయ్య ,తుమ్మనపల్లి కిరణ్ కుమార్, చిలుమూల రమేష్, భాస్కర్ రెడ్డి, కదిరె నాగరాజు, కళ్యాణం అనిల్ కుమార్,శేఖర్, నిఖిల్,ప్రసాద్, రజినీకాంత్, సాయికుమార్,అఖిల్,రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# చిరంజీవి అభిమాని కుటుంబానికి ఆర్థిక సాయం

**బలగం, టీవీ ఇల్లంకుంట**

ఇల్లంతకుంట మండలం రామోజీపేటలో శనివారం హృదయాన్ని కదిలించే సేవా కార్యక్రమం నిర్వహించారు. కమలాపూర్ మండలానికి చెందిన దివంగత చిరంజీవి అభిమాని కిరణ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ప్రతి సంవత్సరం అందిస్తున్న రూ.20 వేల విద్యా సహాయాన్ని ఈ ఏడాది కూడా ఆయన భార్య స్వప్నకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు చేతుల మీదుగా అందజేశారు.దివంగత కిరణ్ కుమార్‌కు ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారి విద్యాభ్యాసానికి చేయూతగా ప్రతి ఏడాది ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు బసవరాజ్ శ్రీనివాస్ తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా నిలవడం సమాజం బాధ్యత అని ఈ సందర్భంగా వి. హనుమంతరావు పేర్కొన్నారు. బసవరాజు శ్రీనివాస్ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్, నాయకులు జనగామ నాగరాజు, అరుణ్ తేజ చారి, మిడిదొడ్డి కపిల్ మాధవ్, గాలిపెల్లి కుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఓదెలలో ఎస్‌బీఐ శాఖ ప్రారంభం

**బలగం టీవీ, ఓదెల**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శాఖను శనివారం పూజా కార్యక్రమాల మధ్య ప్రారంభించారు. సోమవారం నుంచి బ్యాంకింగ్ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ ఓదెలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్త ఖాతాల ప్రారంభం, వివిధ రకాల రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు ఈ శాఖ ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఓదెల మండల ప్రజల చిరకాల కోరిక అయిన ఎస్‌బీఐ శాఖ ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ భాస్కర్ గొల్ల, క్యాషియర్ క్రాంతి, సపోర్ట్ స్టాఫ్ సంపత్, రమణ, సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# సర్ కార్యక్రమం విజయవంతానికి గ్రామాల్లో హెల్ప్‌డెస్క్‌లు

**బలగం టీవీ, కాల్వశ్రీరాంపూర్**

పెద్దపల్లి కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సర్ కార్యక్రమం విజయవంతం కోసం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాముడు తెలిపారు. శనివారం కాల్వశ్రీరాంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించి దరఖాస్తులను పరిశీలించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ హెల్ప్‌డెస్క్‌లో జీపీవో, పంచాయతీ కార్యదర్శి, కారోబార్, వీఓఏలు అందుబాటులో ఉండి ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందిస్తారని చెప్పారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గణన ఫారాలను నింపి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. బీఎల్‌వోలకు ఫారాలు అందజేయని ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలందరూ బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. అలాగే ఓటర్లు ఆన్‌లైన్‌లో గణన ఫారాలు నింపుకోవచ్చని, మీసేవా కేంద్రాల్లో ఉచితంగా ఫారాలు నింపుకునే సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. సమీప మీసేవా కేంద్రాలను వినియోగించుకుని గణన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీపీవో, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్సీ ఎల్ రమణ

**బలగం టీవీ, జగిత్యాల**

జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ శనివారం అందజేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం జగిత్యాల నియోజకవర్గానికి చెందిన తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన మొత్తం రూ.1.50 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ అవసరమైన వారికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీశ్, మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ, రాయికల్ మండలం ప్రధాన కార్యదర్శి కొండపల్కల రత్నాకర్ రావు, వొల్లాల గంగాధర్, గంగిపెల్లి వేణుమాధవ్, పెండెం గంగాధర్, చిరంజీవి, నందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కేంద్రమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు.

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి అలాగే మండల అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి ,జిల్లా నాయకులు మండల నాయకులు ,కార్యకర్తలు పాల్గొని సంజయ్ అన్న నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భవిష్యత్తులో ఉన్నత స్థితిలో నిలవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో బిజెపి పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనమును, పండ్లను అందించారు. అలాగే మహిళా మోర్చా ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్ పెన్నుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ,మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి దుంపెన స్రవంతి,మండల కార్యదర్శి చింతల లహరి, బూత్ అధ్యక్షురాలు తేజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి గౌడ్ పంజా.. ఇంగ్లండ్ విలవిల!



- ఐదు వికెట్లతో చెలరేగిన భారత పేసర్..
- 170 పరుగులకే ఆతిథ్య జట్టు ఆలౌట్
- లార్డ్స్ చరిత్రాత్మక టెస్టులో టీమిండియాకు 115 పరుగుల భారీ ఆధిక్యం

**బలగం టీవీ, లండన్**

చరిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరుగుతున్న రెండో టెస్టులో భారత మహిళా పేసర్ క్రాంతి గౌడ్ నిప్పులు చెరిగింది. తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల (5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్ నడ్డి విరిచింది. క్రాంతి అద్భుత స్వింగ్ బౌలింగ్‌కు తోడు సయాలీ సత్ఘరే, స్నేహ్ రాణా రాణించడంతో ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 170 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా మొదటి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల కీలకమైన స్వల్ప ఆధిక్యం లభించింది.

**మొదటి సెషన్ నుంచే వణికించిన క్రాంతి**

లార్డ్స్ టెస్టులో రెండో రోజైన శనివారం భారత జట్టు పూర్తి పట్టు బిగించింది. సొంతగడ్డపై భారీ స్కోరు సాధించాలనే పట్టుదలతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లను క్రాంతి గౌడ్ మొదటి సెషన్ నుంచే వణికించింది. ఓపెనర్ మియా బౌచిర్ (23)ను పెవిలియన్ చేర్చి ఇంగ్లండ్‌కు గట్టి షాక్ ఇచ్చింది. ఆ తర్వాత బౌండరీలతో ప్రమాదకరంగా మారుతున్న అలిసే క్యాప్సే (9)ను తన మేజికల్ స్వింగ్‌తో క్లీన్ బౌల్డ్ చేసి వెనక్కి పంపింది. ఒక ఎండ్‌లో క్రాంతి వికెట్లు తీస్తుండగా, మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే (2/40), స్నేహ్ రాణా (2/41) కూడా చెలరేగి లంచ్ సమయానికే ఇంగ్లండ్ సగం వికెట్లను పడగొట్టారు.

**జోన్స్, సీవర్ పోరాటం వృథా**

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో మిడిలార్డర్ బ్యాటర్ అమీ జోన్స్ (52) అర్ధ శతకంతో ఒంటరి పోరాటం చేసింది. ఆమెకు తోడుగా కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (44) క్రీజులో పాతుకుపోయి భారత బౌలర్లను ప్రతిఘటించింది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని లంచ్ విరామం తర్వాత క్రాంతి గౌడ్ విడదీసింది. సెట్ అయిన కెప్టెన్ నాట్ సీవర్‌ను అద్భుతమైన బంతితో అవుట్ చేసి భారత్‌కు బ్రేక్ త్రూ అందించింది. అనంతరం లారెన్ బెల్‌ను అవుట్ చేయడం ద్వారా టెస్టు క్రికెట్ చరిత్రలో క్రాంతి గౌడ్ తన మొట్టమొదటి ఐదు వికెట్ల మైలురాయిని అందుకుని 'లార్డ్స్ ఆనర్స్ బోర్డు'పై చోటు సంపాదించుకుంది. చివరి బ్యాటర్‌ను దీప్తి శర్మ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ కథ 170 పరుగుల వద్ద ముగిసింది.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 285 ఆలౌట్

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 170 ఆలౌట్ (అమీ జోన్స్ 52, నాట్ సీవర్ బ్రంట్ 44; క్రాంతి గౌడ్ 5/37, సయాలీ సత్ఘరే 2/40, స్నేహ్ రాణా 2/41)

**ఆధిక్యం: భారత్‌కు మొదటి ఇన్నింగ్స్‌లో 115 పరుగుల ఆధిక్యం లభించింది.**



## ట్రాఫిక్‌లో టీమిండియా!

**సౌతాంప్టన్ రోడ్లపై నిలిచిపోయిన భారత జట్టు బస్సు**

**అరగంట ఆలస్యంగా ప్రారంభమైన ఆఖరి టీ20 మ్యాచ్**

**బలగం టీవీ, సౌతాంప్టన్**

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇక్కడ ప్రారంభం కావాల్సిన ఐదో అంతరాయం కలిగింది. సాధారణంగా క్రికెట్ మ్యాచ్‌లకు వాతావరణం అనుకూలించకపోవడం వల్లనో, లేక వర్షం వల్లనో ఆటంకాలు ఏర్పడటం సహజం. కానీ ఈ ఆఖరి టీ20కి ఎలాంటి వర్ష సూచనా లేదు, వాతావరణం కూడా చాలా ఆహ్లాదకరంగా ఉంది. అయినప్పటికీ నిర్ణీత సమయానికి మ్యాచ్ ప్రారంభం కాలేదు. దీనికి గల విచిత్రమైన కారణం తెలిస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. టీమిండియా ఆటగాళ్లు ప్రయాణిస్తున్న బస్సు సౌతాంప్టన్ భారీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడమే దీనికి కారణం.

**అరగంట ఆలస్యంగా టాస్..**

నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6:30 గంటలకు టాస్ వేసి, 7:00 గంటలకు మ్యాచ్‌ను ప్రారంభించాల్సి ఉంది. అయితే నగరంలో ఊహించని విధంగా ట్రాఫిక్ జామ్ కావడంతో భారత ఆటగాళ్లు తీవ్ర ఆలస్యంగా రాత్రి 6:45 గంటల ప్రాంతంలో మైదానానికి చేరుకున్నారు. ప్లేయర్స్ స్టేడియానికి రావడమే ఆలస్యం కావడంతో అంపైర్లు మ్యాచ్‌ను అరగంట పాటు ఆలస్యంగా నిర్వహించాలని నిర్ణయించారు. దీని ప్రకారం రాత్రి 7:15 గంటలకు టాస్ వేయగా, 7:30 గంటలకు మ్యాచ్ అధికారికంగా ప్రారంభమైంది. ఈ వేదికపై ఇలాంటి ఘటన జరగడం ఇదే తొలిసారి కాదు. గత ఏడాది వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు ఆటగాళ్లు సైతం ఇలాగే ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఆలస్యంగా మైదానానికి చేరుకున్నారు.

# ఇంగ్లండ్ గడ్డపై భారత్ చిత్తు!

- ఆఖరి టీ20లోనూ 56 పరుగుల తేడాతో ఘోర పరాజయం
- 4-0తో సిరీస్ కైవసం చేసుకున్న ఇంగ్లండ్
- భారత్‌ను వెనక్కినెట్టి టీ20ల్లో అగ్రస్థానానికి ఆతిథ్య జట్టు







**బలగం టీవీ, సౌతాంప్టన్**

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా శనివారం సౌతాంప్టన్ వేదికగా ఏకపక్షంగా సాగిన ఆఖరి మ్యాచ్‌లోనూ టీమిండియా 56 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా.. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. నయా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో వరుసగా 7 మ్యాచ్‌లు ఆడిన టీమిండియా ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయింది. తొలి టీ20 వర్షం వల్ల రద్దు కావడం వల్ల సరిపోయింది కానీ.. లేదంటే భారత్‌కు 5-0తో క్లీన్ స్వీప్ అవమానం తప్పేది కాదు.

**బట్లర్ సెంచరీ విధ్వంసం.. బ్రూక్ పరుగుల సునామీ**

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ జోస్ బట్లర్ (64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సలతో 131) విధ్వంసకర శతకంతో చెలరేగగా, కెప్టెన్ హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సలతో 95 నాటౌట్) పరుగుల సునామీ సృష్టించాడు. భారత బౌలర్లలో శివమ్ దూబే (2/22) రెండు వికెట్లు తీయగా, ప్రసిధ్ కృష్ణ ఒక వికెట్ పడగొట్టాడు. పిచ్‌ను అంచనా వేయడంలో విఫలమైన భారత్ భారీ మూల్యం చెల్లించుకుంది.

**పోరాడిన ఇషాన్, తిలక్ వర్మ**

258 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఓపెనర్ అభిషేక్ శర్మ (6) మరోసారి నిరాశపరచగా.. జట్టులోకి తిరిగొచ్చిన సంజూ శాంసన్ (27) కొద్దిసేపు అలరించాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (35 బంతుల్లో 56; 7 ఫోర్లు, 2 సిక్సలు), తిలక్ వర్మ (25 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్సలు) హాఫ్ సెంచరీలతో గట్టిగానే పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28) రాణించినా.. శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్ విఫలమవ్వడంతో భారత్ ఓటమి ఖాయమైంది. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కరణ్ 3 వికెట్లు పడగొట్టగా, ఆదిల్ రషీద్ రెండు వికెట్లు తీశాడు.

**సంక్షిప్త స్కోర్లు:**

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 257/3 (జోస్ బట్లర్ 131, హ్యారీ బ్రూక్ 95 నాటౌట్; శివమ్ దూబే 2/22)

భారత్: 20 ఓవర్లలో 201/8 (ఇషాన్ కిషన్ 56, తిలక్ వర్మ 53; సామ్ కరణ్ 3/36, ఆదిల్ రషీద్ 2/35)

ఫలితం: 56 పరుగుల తేడాతో ఇంగ్లండ్ విజయం. 4-0తో సిరీస్ కైవసం.

**మంగళవారం నుంచి వన్డే సిరీస్**

టీ20 సిరీస్ ముగియడంతో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జూలై 14 (మంగళవారం) నుంచి మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జట్టుతో కలవనున్నారు.




## విదేశీ గడ్డపై 'భారత బోల్ట్' సంచలనం!

**జర్మనీ మీట్‌లో 10.14 సెకన్లలోనే వంద మీటర్ల పరుగు పూర్తి**

**విదేశాల్లో ఇంత వేగంగా పరిగెత్తిన తొలి భారత అథ్లెట్‌గా అనిమేశ్ కుజుర్ రికార్డు**

**టోక్యో వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌పై గురి**

**బలగం టీవీ, బెర్లిన్**

భారత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సరికొత్త ఆశాకిరణంగా అవతరించిన యువ అథ్లెట్ అనిమేశ్ కుజుర్ మరోసారి అంతర్జాతీయ వేదికపై సంచలన రికార్డుతో వార్తల్లో నిలిచాడు. విదేశీ గడ్డపై జరిగిన ప్రతిష్టాత్మక 'పుమా ఫాస్ట్ ఆర్మ్ లెగ్స్ 2026 మీట్'లో ఈ 'ఇండియన్ ఉసేన్ బోల్ట్' బుల్లెట్ వేగంతో దూసుకెళ్లాడు. వంద మీటర్ల పరుగును కేవలం 10.14 సెకన్లలోనే పూర్తి చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. భారత్ అవతల (విదేశాల్లో) ఇంతటి అత్యుత్తమ వేగంతో 100 మీటర్ల దూరాన్ని చేరుకున్న మొట్టమొదటి భారతీయ రన్నర్‌గా అనిమేశ్ సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

**చిరుత వేగంతో దూసుకెళ్లి..**

టోక్యో వేదికగా జరగబోయే 'వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్'ను లక్ష్యంగా చేసుకుని బరిలోకి దిగిన 22 ఏళ్ల అనిమేశ్ కుజుర్, ఈ టోర్నీలో చిరుతలా పరుగు తీశాడు. తొలుత జరిగిన హీట్స్‌లో 10.19 సెకన్ల సమయానికే పరిమితమైనప్పటికీ, ఫైనల్లో తన వేగాన్ని మరింత మెరుగుపరుచుకుని 10.14 సెకన్లతో రేస్‌ను ముగించి అందరినీ ఔరా అనిపించాడు. అయితే, అత్యంత వేగవంతమైన టైమింగ్‌తో అగ్రస్థానంలో ఉన్న భారత రన్నర్ గురిందెర్వీర్ సింగ్ (10.09 సెకన్లు) రికార్డును మాత్రం అనిమేశ్ కొద్దిలో అందుకోలేకపోయాడు.

**మారుమూల గ్రామం నుంచి డైమండ్ లీగ్ దాకా..**


ఛత్తీస్‌గఢ్‌లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన అనిమేశ్ కుజుర్ ఆరడుగుల రెండు అంగుళాల పొడవైన శరీరధారుడు. టీనేజ్ వయసు నుంచే తన అసాధారణ స్పీడ్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్న ఈ కుర్రాడు, ఇటీవలే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలోనే అధిగమించి 'ది ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు. దేశం గర్వించదగ్గ అథ్లెట్‌గా ఎదుగుతున్న అనిమేశ్, కొద్దిరోజుల క్రితమే ప్రతిష్టాత్మక 'మొనాకో డైమండ్ లీగ్'లోనూ పోటీపడి అందరి దృష్టిని ఆకర్షించాడు. అలాగే అండర్-23 విభాగంలో 200 మీటర్ల పరుగులో ఆస్ట్రేలియా స్టార్ రన్నర్ గౌట్ గౌట్‌తో 'నువ్వా-నేనా' అన్నట్లు తలపడ్డాడు. ఆ రేసులో సెకనులో పదో వంతు తేడాతో తృటిలో పోడియం (పతకం) పొందే అవకాశాన్ని కోల్పోయినప్పటికీ, ఈ యంగ్ అథ్లెట్ ఏమాత్రం నిరాశ చెందడం లేదు. రాబోయే అంతర్జాతీయ వేదికలపై 100 మీటర్లు, 200 మీటర్ల విభాగాల్లో భారత జెండాను రెపరెపలాడించడమే ధ్యేయంగా మరింత కఠినంగా శ్రమిస్తున్నానని అనిమేశ్ ధీమా వ్యక్తం చేశాడు.

**టాప్-5 అత్యంత వేగవంతమైన టైమింగ్స్**

భారత 100 మీటర్ల పరుగు పందెం చరిత్రలో నమోదైన అత్యుత్తమ టైమింగ్స్ వివరాలు:

గురిందెర్వీర్ సింగ్ -- 10.09 సెకన్లు
అనిమేశ్ కుజుర్ -- 10.14 సెకన్లు (తాజా రికార్డు)
అనిమేశ్ కుజుర్ -- 10.15 సెకన్లు
గురిందెర్వీర్ సింగ్ -- 10.17 సెకన్లు
అనిమేశ్ కుజుర్ -- 10.18 సెకన్లు

# 16 ఏళ్ల తర్వాత.. సెమీస్‌లో స్పెయిన్!



**క్వార్టర్ ఫైనల్లో 2-1తో బెల్జియంపై ఉత్కంఠ విజయం**

**40 ఏళ్ల నాటి పరాజయానికి ప్రతీకారం తీర్చుకున్న స్పానిష్ జట్టు**

**బుధవారం డాలస్‌లో ఫ్రాన్స్‌తో తొలి సెమీఫైనల్ పోరు**

బలగం టీవీ, లాస్ ఏంజిల్స్

ఫిఫా ప్రపంచకప్ టోర్నీలో స్పానిష్ ఆర్మీ సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచకప్ వేదికపై సుదీర్ఘ విరామం తర్వాత స్పెయిన్ జట్టు సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక హోరాహోరీగా ముగిసిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 2-1 గోల్స్ తేడాతో బలమైన బెల్జియం జట్టును చిత్తు చేసింది. తద్వారా 16 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. స్పెయిన్ జట్టు చివరిసారిగా 2010లో సెమీఫైనల్లోకి ప్రవేశించడమే కాకుండా, ఆ ఏడాదే తొలిసారి ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడింది.

**మెరిసిన రూయిజ్, మదీనో..**

మ్యాచ్ ప్రారంభం నుంచే స్పెయిన్ ఆటగాళ్లు మైదానంలో పూర్తి ఆధిపత్యం చెలాయించారు. ఆట 30వ నిమిషంలో స్పెయిన్ స్టార్ ఫాబియన్ రూయిజ్ అద్భుతమైన గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే బెల్జియం జట్టు కూడా గట్టిగానే ప్రతిఘటించింది. ఆట 41వ నిమిషంలో బెల్జియం ప్లేయర్ చార్లెస్ కెటెలార్ గోల్ చేయడంతో మొదటి సగం ముగిసేసరికి స్కోరు 1-1తో సమమైంది. రెండో సగంలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా శ్రమించాయి. మ్యాచ్ ముగియడానికి మరో రెండు నిమిషాలు ఉండగా (88వ నిమిషంలో), సబ్ స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన స్పెయిన్ ఆటగాడు మికెల్ మదీనో సంచలన గోల్ కొట్టి జట్టును విజేతగా నిలిపాడు. మ్యాచ్ మొత్తంలో స్పెయిన్ ఏకంగా 16 సార్లు బెల్జియం గోల్‌పోస్టుపై దాడులు చేసి మ్యాచ్‌పై తమ పట్టును ప్రదర్శించింది.

**40 ఏళ్ల నాటి లెక్క సరి!**

తాజా విజయంతో స్పెయిన్ జట్టు సరిగ్గా 40 ఏళ్ల క్రితం బెల్జియం చేతిలో ఎదురైన పరాజయానికి లెక్క సరిచేసింది. గతంలో 1986 ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడగా, ఆనాడు పెనాల్టీ షుటౌట్‌లో బెల్జియం 5-4తో స్పెయిన్‌ను ఓడించి సెమీస్ చేరింది. తాజా విజయంతో ఆ పాత పరాజయానికి స్పెయిన్ ప్రతీకారం తీర్చుకుంది. ఈ టోర్నీలో భాగంగా బుధవారం డాలస్‌లో జరగబోయే హై-వోల్టేజ్ తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ జట్టుతో స్పెయిన్ తలపడనుంది.

## టెన్నిస్ కోర్టులో క్రికెట్ దిగ్గజాల సందడి!

**వింబుల్డన్ రాయల్ బాక్స్‌లో మెరిసిన సచిన్, లారా, శుభ్‌మన్ గిల్**

**వీరితో ముచ్చటించిన టెన్నిస్ లెజెండ్ రోజర్ ఫెదరర్**

**జకోవిచ్, సినర్ హై-వోల్టేజ్ సెమీఫైనల్ మ్యాచ్ వీక్షణ**

**బలగం టీవీ, లండన్**



ఇంగ్లండ్ వేదికగా ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి క్రికెట్ కళ వచ్చింది. ప్రతి ఏటా టెన్నిస్ కోర్టులో దిగ్గజాలు సందడి చేసే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్ మ్యాచ్‌కు క్రికెట్ ప్రపంచానికి చెందిన మహామహులు హాజరయ్యారు. టెన్నిస్ గ్యాలరీలోని రాయల్ బాక్స్‌లో భారత క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్, వెస్టిండీస్ లెజెండ్ బ్రియాన్ లారా, టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా రాయల్ బాక్స్‌లో సూట్ ధరించి రాయల్ లుక్‌లో కనిపించిన గిల్ కెమెరా కళ్లను కట్టిపడేశాడు.

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన సతీమణి అంజలి సమేతంగా ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌ను చూసేందుకు రాగా, రాయల్ బాక్స్‌లో వారి పక్కనే భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా ఆసీనుడయ్యాడు. మ్యాచ్ విరామ సమయంలో టెన్నిస్ ప్రపంచ ఆరాధ్య దైవం, స్విస్ లెజెండ్ రోజర్ ఫెదరర్ వీరి వద్దకు వచ్చి కాసేపు ముచ్చటించాడు. ఒకే వేదికపై క్రికెట్, టెన్నిస్ దిగ్గజాలైన సచిన్, లారా, ఫెదరర్, గిల్‌లు కలిసి కనిపించడంతో మైదానంలోని కెమెరాలన్నీ వారివైపే తిరిగాయి. వీరంతా కలిసి నోవాక్ జకోవిచ్, జాన్నిక్ సినర్ మధ్య జరిగిన హై-వోల్టేజ్ సెమీఫైనల్ పోరును ఆస్వాదించారు.

త్వరలో ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ కోసం కాస్త ముందుగానే లండన్ చేరుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇక్కడ చాలా బిజీగా గడుపుతున్నాడు. మొన్నటికి మొన్న పాప్ సింగర్లను కలవడం, నిన్న మెర్సిడెజ్ బెంజ్ గ్యారేజ్‌లో ఫార్ములా వన్ రేసర్ ఆంటినెల్లాతో కలిసి కారిడార్ క్రికెట్ ఆడి సందడి చేసిన గిల్.. తాజాగా వింబుల్డన్ వేదికపై రోజర్ ఫెదరర్, బ్రియాన్ లారాలతో క్రీడా విషయాలను పంచుకుంటూ కెప్టెన్ కూల్‌గా కనిపిస్తున్నాడు. ప్రపంచ క్రీడా రంగంలో అత్యున్నత శిఖరాలైన సచిన్ టెండూల్కర్, బ్రియాన్ లారా, రోజర్ ఫెదరర్‌లతో పాటు భారత నయా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఒకే ఫ్రేమ్‌లో ఉన్న చిత్రాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. క్రికెట్, టెన్నిస్ అభిమానులు 'పర్ఫెక్ట్ క్రీడా సమ్మేళనం' అంటూ ఈ ఫొటోలపై కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

# టీజీ 20 ఫైనల్‌కు రంగం సిద్ధం

**బలగం టీవీ, హైదరాబాద్**

టీజీ 20 క్రికెట్ లీగ్ క్లైమాక్స్‌కు చేరుకుంది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్, ఎన్విత ఖమ్మం ఏసెస్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇరు జట్ల కెప్టెన్లు అభిరథ్ రెడ్డి, సీవీ మిలింద్ పాల్గొన్నారు.

హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ కెప్టెన్ అభిరథ్ రెడ్డి మాట్లాడుతూ జట్టు ఫైనల్ చేరడం ఆనందంగా ఉందన్నారు. టీజీ 20 లీగ్ గ్రామీణ ప్రాంతాల క్రికెటర్లకు మంచి వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ప్రతి ఫ్రాంచైజీ జిల్లా స్థాయిలో ట్రయల్స్ నిర్వహించే అవకాశముందని, దీంతో కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. తమ జట్టులో వైష్ణవ్ ప్రదర్శన ఆశ్చర్యానికి గురి చేసిందని, క్రికెట్‌కు దూరమైన అతను లీగ్ కారణంగా మళ్లీ బ్యాట్ పట్టుకుని మంచి ఆట కనబరుస్తున్నాడని తెలిపారు. గెలుపు కంటే ఓటమి ఎక్కువ పాఠాలు నేర్పుతుందని వ్యాఖ్యానించారు.




ఖమ్మం ఏసెస్ కెప్టెన్ సీవీ మిలింద్ మాట్లాడుతూ టోర్నీలో ఇరు జట్లు అత్యుత్తమ ప్రదర్శన చేశాయని అన్నారు. క్వాలిఫయర్‌లో తమ జట్టు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణించిందని చెప్పారు. అభిరథ్ రెడ్డి గ్రౌండ్ బయట మంచి స్నేహితుడైనా, మైదానంలో మాత్రం గట్టి పోటీ ఉంటుందని పేర్కొన్నారు. టీజీ 20 అనేకమంది ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు కల్పిస్తోందని, క్రికెట్‌ను మధ్యలో మానేసిన వారు కూడా తిరిగి ఆటలోకి వస్తున్నారని తెలిపారు. తమ జట్టులో మల్లు సహేంద్ర ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుందని చెప్పారు.

హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఈ లీగ్‌లో పాల్గొన్న ఆటగాళ్లలో ఎక్కువ మంది గ్రామీణ నేపథ్యానికి చెందిన వారేనని తెలిపారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన రూపంలో టోర్నీ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, 2027లో రెండు స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. బీసీసీఐ రాష్ట్ర స్థాయి టోర్నీల షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఏడాది టీజీ 20ని జూన్ తొలి వారంలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్‌కు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. కేబినెట్ మంత్రులు, సినీ నటుడు విజయ్ దేవరకొండ, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.